

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | మంగళవారం 12-08-2025 | సంపుటి - 24 | సంచిక - 97 | రూ : 4 | పేజీలు: 8


## గచ్చిబౌలిలో యూనిటీ మాల్

- 5.16 ఎకరాల్లో 50 అంతస్తుల టవర్
- మొత్తం ప్రాజెక్టు విలువ రూ.1,500 కోట్లు!
- రూ.202 కోట్లు మంజూరు చేసిన కేంద్రం
- పీపీపీ విధానంలో నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం
- పనులు వేగంగా చేయాలని సీఎం ఆదేశాలు



2లో

## 60 ఏళ్ల ఆదాయపు పన్ను చట్టానికి స్వస్తి..

# లోక్‌సభలో కొత్త బిల్లు పాస్



2లో

- ప్రతిపక్షాల తీవ్ర నిరసనల మధ్య లోక్‌సభలో రెండు కీలక ఆర్థిక బిల్లులు పాస్
- మూజువాణి ఓటుతో ఆదాయపు పన్ను బిల్లు, పన్నుల చట్టాల సవరణ బిల్లుకు ఆమోదం
- ఆరు దశాబ్దాల నాటి 1961 ఆదాయపు పన్ను చట్టం స్థానంలో కొత్త చట్టం
- ఎన్నికల జాబితాల ప్రత్యేక సవరణను వ్యతిరేకిస్తూ విపక్షాల ఆందోళన
- సౌదీ అరేబియా పెట్టుబడులకు పన్ను మినహాయింపులు కల్పించే సవరణలు
- వచ్చే ఏడాది ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానున్న కొత్త ఆదాయపు పన్ను చట్టం



2లో

## కొండా సురేఖ ఇంటి ముందు ఉద్రిక్తత..

- హన్మకొండలో సురేఖ ఇంటి ముందు మధ్యాహ్న భోజన కార్మికుల నిరసన
- మధ్యాహ్న భోజనన పథకాన్ని అక్షయపాత్రకు ఇవ్వొద్దని డిమాండ్
- సురేఖ ఇంట్లోకి చొరబడేందుకు యత్నం

## టాలీవుడ్‌లో ఆగిన సినిమా షూటింగులు..

### ప్రభుత్వానికి చేరిన వివాదం



2లో

- వేతనాల పెంపు డిమాండ్‌తో సినీ కార్మికుల సమ్మె
- నిలిచిపోయిన తెలుగు సినిమా షూటింగులు
- రంగంలోకి దిగిన తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి
- చర్చల ద్వారా సహేతుకమైన పరిష్కారం కనుగొనాలని మంత్రి సూచన
- 30 శాతం పెంపు చిన్న సినిమాలకు భారమంటున్న నిర్మాతలు



## రేవంత్ రెడ్డికి తెలంగాణ హైకోర్టులో ఊరట

- ఎన్నికల కోడ్ ఉల్లంఘన కేసు
- 2019 అక్టోబర్ లో సూర్యాపేట జిల్లాలో రేవంత్ పై కేసు నమోదు
- కేసును కొట్టివేస్తూ తీర్పును వెలువరించిన హైకోర్టు

హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై గతంలో నమోదైన రెండు వేర్వేరు కేసుల్లో సోమవారం హైకోర్టులో ఊరట లభించింది.

తరువాయి 2లో



2లో

## ఏపీలో లాజిస్టిక్స్ కార్పొరేషన్ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్..

- సీఎం చంద్రబాబు కీలక సమీక్ష



## అసిమ్ మునీర్ అణు వ్యాఖ్యలపై భారత్ ఘాటు స్పందన..

- అది వారికి పరిపాటేనని కౌంటర్
- అమెరికా గడ్డపై నుంచి భారత్‌కు పాక్ ఆర్మీ చీఫ్ అణు హెచ్చరికలు
- మాతో పాటు సగం ప్రపంచాన్ని నాశనం చేస్తామన్న అసిమ్ మునీర్
- పాక్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన భారత విదేశాంగ శాఖ
- ఇది పాకిస్థాన్‌కు పరిపాటేనని, బాధ్యతారహిత చర్య అని వ్యాఖ్య
- ఇలాంటి బెదిరింపులకు భయపడబోమని స్పష్టం చేసిన భారత్

2లో

## పార్లమెంటు నుంచి ఈసీ కార్యాలయం వరకు.. 300 మంది ప్రతిపక్ష ఎంపీల మార్చ్!

### నిరసన మార్చ్‌కు అనుమతి కోరలేదన్న పోలీసులు



- 'ఓట్ చోరీ', బీహార్ ఓటరు జాబితా ప్రత్యేక సవరణపై నిరసన తెలియజేయడమే మార్చ్ ప్రధాన ఉద్దేశం
- 'ఆప్' కూడా మార్చ్‌లో పాల్గొనే అవకాశం

2లో

# రేవంత్ రెడ్డికి తెలంగాణ హైకోర్టులో ఊరట

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హైకోర్టులో ఊరట లభించింది. 2019 అక్టోబర్లో సూర్యాపేట జిల్లా గరిడేపల్లి పరిధిలో ఎన్నికల కోడ్ ను ఉల్లంఘించారంటూ రేవంత్ పై పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే, ఆ కేసును కొట్టివేయాలని రేవంత్ రెడ్డి క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ క్రమంలో రేవంత్ పిటిషన్ పై ధర్మాసనం పలుమార్లు విచారణ చేపట్టింది. ఇరుపక్షాల వాదనలను విన్న హైకోర్టు కేసును కొట్టివేస్తూ తీర్పు వెలువరించింది.

# అసిమ్ మునీర్ అణు వ్యాఖ్యలపై భారత్ ఘాటు స్పందన..

అమెరికా గడ్డపై నుంచి పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్ చేసిన అణు బెదిరింపులపై భారత్ తీవ్రంగా స్పందించింది. ఇలాంటి అణు ప్రగల్భాలు పలకడం పాకిస్థాన్‌కు పరిపాటి అని, మిత్ర దేశం భూభాగం నుంచి ఇలాంటి బాధ్యతారహిత వ్యాఖ్యలు చేయడం విచారకరమని సోమవారం భారత విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. అమెరికాలోని ఫ్లోరిడా రాష్ట్రంలోని టంపా నగరంలో పాకిస్థానీ సంతతి ప్రజలతో జరిగిన ఒక సమావేశంలో అసిమ్ మునీర్ ఈ వివాదాస్పద వ్యాఖ్యలు చేసినట్లు కథనాలు వెలువడ్డాయి. భవిష్యత్తులో భారత్‌తో యుద్ధం జరిగి, తమ దేశ మనుగడకే ముప్పు వాటిల్లితే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. "మేము అణ్వస్త్ర దేశం. మేం మునిగిపోతున్నామని అనిపిస్తే, మాతో పాటు సగం ప్రపంచాన్ని తీసుకుపోతాం" అని మునీర్ హెచ్చరించినట్లు సమాచారం. ఈ వ్యాఖ్యలపై భారత్ తీవ్రంగా స్పందించింది. "ఇలాంటి బాధ్యతారహిత వ్యాఖ్యల విషయంలో అంతర్జాతీయ సమాజం తన సొంత నిర్ధారణకు రాగలదు. మరోవైపు, పాకిస్థాన్ అణ్వాయుధాలు కలిగిన ఒక బాధ్యతారహిత దేశమని కేంద్ర ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. అమెరికా మద్దతు లభించినప్పుడల్లా పాకిస్థాన్ సైన్యం తన అసలు స్వరూపాన్ని బయటపెడుతుందని, ఇది ఎప్పటినుంచో జరుగుతున్నదేనని వ్యాఖ్యానించాయి. పాకిస్థాన్‌లో ప్రజాస్వామ్యం లేదని, అంతా సైన్యం నియంత్రణలోనే ఉందని ఈ వ్యాఖ్యలు నిరూపిస్తున్నాయని, ఆ దేశంలోని అణ్వాయుధాలు ఉగ్రవాదుల చేతుల్లోకి వెళ్లే నిజమైన ప్రమాదం ఉందని ఆ వర్గాలు ఆందోళన వ్యక్తం చేశాయి.

## ఏపీలో లాజిస్టిక్స్ కార్పొరేషన్

# ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్..

ఏపీ సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలోని కీలకమైన పోర్టులు, ఫిషింగ్ హార్బర్ల మొదటి దశ పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చేలా ఈ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను వేగవంతం చేయాలని, వాటిని రాష్ట్రానికి ఆర్థిక వనరులుగా మార్చాలని ఆయన సూచించారు. సోమవారం ఉండవల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో పోర్టులు, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో చంద్రబాబు ఈ మేరకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో రవాణా, సరఫరా వ్యవస్థలను మరింత పటిష్ఠం చేసేందుకు ఏపీ లాజిస్టిక్స్ కార్పొరేషన్‌ను త్వరితగతిన ఏర్పాటు చేయాలని చంద్రబాబు అధికారులను ఆదేశించారు. పోర్టులు, విమానాశ్రయాలు, రహదారులను అనుసంధానిస్తూ సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు. దీని ద్వారా లాజిస్టిక్స్ ఖర్చులు తగ్గించి, ఎగుమతి సామర్థ్యాన్ని పెంచవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. పోర్టులు, పారిశ్రామిక ప్రాంతాలకు అనుసంధానం మెరుగుపరిచేందుకు, ట్రాఫిక్ అవసరాలకు అనుగుణంగా పీపీపీ పద్ధతిలో రహదారుల విస్తరణ చేపట్టాలని అధికారులకు తెలిపారు. స్థానిక మత్స్యకారుల ప్రయోజనాలకు ఎలాంటి భంగం కలగకుండా, కొన్ని ఫిషింగ్ హార్బర్లను మైనర్ పోర్టులుగా అప్‌గ్రేడ్ చేసే అవకాశాలను పరిశీలించాలని సీఎం కోరారు. మచిలీపట్నం, రామాయపట్నం, మూలపేట, కాకినాడ గేట్‌వే పోర్టులతో పాటు, జువ్వలదిన్నె, నిజాంపట్నం, మచిలీపట్నం, ఉప్పాడ ఫిషింగ్ హార్బర్ల తొలి దశ పనులను గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు.

## కొండా సురేఖ..

# ఇంటి ముందు ఉద్రిక్తత

**హైదరాబాద్ :** హన్మకొండలోని మంత్రి కొండా సురేఖ ఇంటి ముందు మధ్యాహ్న భోజన కార్మికులు నిరసన చేపట్టారు. మధ్యాహ్న భోజనం పథకాన్ని అక్షయపాత్రకు ఇవ్వొద్దని డిమాండ్ చేస్తూ వారు నిరసనకు దిగారు. అక్షయపాత్రకు మధ్యాహ్న భోజన పథకాన్ని కేటాయించే ప్రతిపాదనను విరమించుకోవాలని నినాదాలు చేశారు. ఈ నిర్ణయం కారణంగా మధ్యాహ్న భోజన పథకంపై ఆధారపడి జీవనం సాగిస్తున్న వారికి తీరని నష్టం జరుగుతుందని చెప్పారు. ఈ ప్రతిపాదనను విరమించుకోకపోతే ఉద్యమాన్ని ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. మధ్యాహ్న భోజన కార్మికులకు పని భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. వెంటనే 8 నెలల పెండింగ్ బిల్లులు ఇవ్వాలని, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని నినాదాలు చేశారు. సురేఖ ఇంట్లోకి చొరబడేందుకు ప్రయత్నం చేయగా పోలీసులు వారిని అడ్డుకుని, చెదరగొట్టారు.

# పార్లమెంటు నుంచి ఈసీ కార్యాలయం వరకు..

## 300 మంది ప్రతిపక్ష ఎంపీల మార్చ్!

**ఢిల్లీ:** 25 ప్రతిపక్ష పార్టీలకు చెందిన 300 మందికి పైగా ఎంపీలు నేడు పార్లమెంట్ నుంచి భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) ప్రధాన కార్యాలయం వరకు మార్చ్ నిర్వహించనున్నారు. 2024 లోక్‌సభ ఎన్నికలలో జరిగినట్లు ఆరోపిస్తున్న 'ఓట్ చోరీ' (ఓట్ల దొంగతనం), ఎన్నికలు జరగనున్న బీహార్‌లో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్)పై నిరసన తెలియజేయడమే ఈ మార్చ్ ప్రధాన ఉద్దేశం. కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ, టీఎంసీ, డీఎంకే, ఆప్, వామపక్షాలు, ఆర్జేడీ, ఎన్సీపీ(ఎస్పీ), శివసేన (యూబీటీ), నేషనల్ కాన్ఫరెన్స్ వంటి పలు పార్టీలు ఈ ర్యాలీలో పాల్గొనే అవకాశం ఉంది. ఉదయం 11:30 గంటలకు పార్లమెంట్ మకర్ ద్వార్ నుంచి ఈ మార్చ్ ప్రారంభమవుతుంది. అయితే, ఈ మార్చ్‌కు సంబంధించి అనుమతి కోరుతూ తమకు ఎలాంటి అభ్యర్థన రాలేదని పోలీసులు తెలిపారు. ఈ నిరసనకు ఇండియా కూటమి పిలుపునిచ్చినప్పటికీ బ్యానర్లు లేకుండానే మార్చ్ నిర్వహించాలని నిర్ణయించారు. ప్రతిపక్ష కూటమి నుంచి 'ఆప్' బయటకు వచ్చినప్పటికీ ఈ మార్చ్‌లో అది కూడా పాల్గొనే అవకాశం ఉంది. కాగా, ఎన్నికల సంఘం పారదర్శకంగా ఉండాలని, డిజిటల్ ఓటర్ జాబితాను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఒక వెబ్ పోర్టల్‌ను ప్రారంభించారు.

## ఈడీ విచారణకు

# హాజరైన సినీ నటుడు రానా



హైదరాబాద్: గేమింగ్ యాప్‌లకే ప్రచారం చేశాను తప్ప బెట్టింగ్ యాప్‌లకు కాదని, నిబంధనల ఉల్లంఘనకు పాల్పడలేదని సినీ నటుడు దగ్గుబాటి రానా ఈడీ అధికారులకు చెప్పినట్లు తెలుస్తోంది. బెట్టింగ్ యాప్‌లకు ప్రచారం చేసిన పలువురు సినీ ప్రముఖులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే ప్రకాశ్‌రాజ్, విజయ్ దేవరకొండలను విచారించింది. రానా జులై 23వ తేదీనే విచారణకు హాజరు కావాల్సి ఉండగా... ఆయన విజ్ఞప్తి మేరకు విచారణను అధికారులు వాయిదా వేశారు. ఈ మేరకు సోమవారం ఉదయం 10.30 గంటల సమయంలో రానా ఈడీ కార్యాలయానికి చేరుకున్నారు. తనవెంట పలు దస్త్రాలను తీసుకొచ్చారు. తాను ప్రచారం చేసిన సంస్థలకు చెందిన ఒప్పందపత్రాలు వాటిలో ఉన్నట్లు తెలుస్తోంది. విచారణ ముగిసిన అనంతరం మధ్యాహ్నం 2.40 గంటలకు తిరిగివెళ్లారు. అవసరమైతే మరోసారి పిలుస్తామని ఆయనకు ఈడీ అధికారులు చెప్పినట్లు సమాచారం.

# గచ్చిబౌలిలో యూనిటీ మాల్



హైదరాబాద్: హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో 'యూనిటీ మాల్' పేరిట రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక నిర్మాణం చేపట్టనుంది. రాయదుర్గం ప్రాంతంలోని 'తెలంగాణ లెదర్ ఇండస్ట్రీస్ ప్రమోషన్ కార్పొరేషన్ లిమిటెడ్' ప్రాంగణంలో 5.16 ఎకరాల విస్తీర్ణంలో 50 అంతస్తులతో ఈ 'యూనిటీ మాల్' టవర్ నిర్మాణానికి సన్నాహాలు చేస్తోంది. ఇందులో 5 బేస్‌మెంట్లను పార్కింగ్, ఇతర సౌకర్యాల కోసం... 6 అంతస్తులను చేనేత, హస్తకళల ఉత్పత్తుల ప్రదర్శనకు కేటాయించారు. మిగిలిన 39 అంతస్తులను కార్యాలయాలు, వాణిజ్య సముదాయాల కోసం వినియోగించనున్నారు. మొత్తం 29 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించనున్న ఈ భారీ ప్రాజెక్టు బడ్జెట్ విలువను రూ.1,500 కోట్లుగా అంచనా వేశారు. దీని నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే రూ.202 కోట్లు కేటాయించింది. ఈ బహుళ అంతస్తుల భవనాన్ని ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ)తో నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి సంబంధించిన పనులను వేగవంతం చేయాలని ఇటీవల జరిగిన సమావేశంలో అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. భారతదేశ సాంస్కృతిక వైవిధ్యం, స్థానిక హస్తకళలు, చేనేత ఉత్పత్తులను ఒకే వేదికపై ప్రదర్శించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం.. 'ఒక జిల్లా ఒక ఉత్పత్తి(ఓడీఓపీ)' పథకం కింద దేశవ్యాప్తంగా 'యూనిటీ మాల్'లు నిర్మించాలని నిర్ణయించింది. ప్రతి జిల్లాకు ఒక నిర్దిష్ట ఉత్పత్తిని గుర్తించి.. దాన్ని జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో ప్రచారం చేయడం ద్వారా.. స్థానిక కళాకారులు, చేనేత కార్మికుల ఆర్థిక పరిస్థితిని బలోపేతం చేయడం ఈ పథకం ప్రధాన ఉద్దేశం. యూనిటీ మాల్... వాణిజ్య కేంద్రంగా మాత్రమే కాకుండా సాంస్కృతిక వారసత్వాన్ని ప్రదర్శించే కేంద్రంగా కూడా ఉండాలని లక్ష్యం నిర్దేశించారు. దీని ద్వారా స్థానిక కళాకారులు, చిన్నతరహా వ్యాపారులు తమ ఉత్పత్తులకు జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లలో ప్రచారం చేసే అవకాశాలను పొందుతారు. ఈ ప్రాజెక్టు రాష్ట్రంలో ఉపాధి అవకాశాలను సృష్టించడంతో పాటు.. హైదరాబాద్‌ను ప్రముఖ వాణిజ్య కేంద్రంగా మరింత బలోపేతం చేస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. 'ఓడీఓపీ' పథకానికి కేంద్ర ప్రభుత్వం మొత్తం రూ.5 వేల కోట్లు కేటాయించింది. ఇందులో భాగంగా హైదరాబాద్‌లో యూనిటీ మాల్ నిర్మాణానికి రూ.202 కోట్లు మంజూరు చేసింది. రూ.101 కోట్లు విడుదల చేసింది.

**డీపీఆర్‌కు కేంద్రం ఆమోదం**

కేంద్రం ఆదేశాల మేరకు తెలంగాణ ప్రభుత్వం శేరిలింగంపల్లి మండలం పరిధిలోని 'తెలంగాణ లెదర్ ఇండస్ట్రీస్ ప్రమోషన్ కార్పొరేషన్ లిమిటెడ్' ప్రాంగణంలో 5.16 ఎకరాలు కేటాయించింది. 2.13 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో 6 అంతస్తులు.. 3 బేస్‌మెంట్లతో 'యూనిటీ మాల్' నిర్మించాలని తొలుత భావించింది. దీనికి రూ.213.58 కోట్లు వ్యయమవుతుందని అంచనా వేశారు. గచ్చిబౌలిలో ప్రస్తుతమున్న భూమి విలువ, ఆర్థిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని.. 5.16 ఎకరాల స్థలంలో కేవలం 6 అంతస్తులు మాత్రమే వినియోగానికి వస్తే ప్రయోజనకరం కాదని రాష్ట్ర ప్రభుత్వం భావించింది. అందుకే ప్రాజెక్టును 50 అంతస్తులకు విస్తరించింది. సంబంధిత సవివర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను కేంద్ర ప్రభుత్వం ఆమోదించింది. భవనం ఎత్తుకు సంబంధించి 2025 ఏప్రిల్ 25న 'ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా' నిరభ్యంతర పత్రం జారీ చేసింది.

**టెండర్ల ప్రక్రియపై..**

'యూనిటీ మాల్' నిర్మాణంపై దిల్లీలో ఈ ఏడాది జులై 30న డిపార్ట్‌మెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్ (డీపీఐఐటీ) డైరెక్టర్ అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. మాల్ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని, కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే విడుదల చేసిన రూ.101 కోట్ల నిధులను 2026 మార్చి 31లోగా ఖర్చు చేయాలని సూచించారు. దీంతో ప్రాజెక్టును వేగవంతం చేయడంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టింది. తాజాగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వద్ద ఈ అంశంపై ఉన్నతాధికారుల సమావేశం జరిగింది. పీపీపీ మోడల్‌లో నిర్మాణానికి త్వరితగతిన టెండర్ల ప్రక్రియ పూర్తి చేయాలని, 2027 నాటికి బహుళ అంతస్తుల భవనాన్ని సిద్ధం చేయాలని సీఎం ఆదేశించారు.

# 15 నుంచే టోల్‌ప్లాజాలలో వార్షిక టోల్‌పాస్ అమలు



*** ఎక్కడెక్కడ చెల్లుతుందంటే**

చౌటుప్పల్: దేశవ్యాప్తంగా ప్రైవేటు వాహనదారులకు జాతీయ రహదారులపై ప్రయాణాన్ని మరింత సులభంగా, చవకగా చేసేందుకు కేంద్రం వార్షిక టోల్‌పాస్‌ను ఈ నెల 15 నుంచి అమల్లోకి తీసుకురానుంది. ఏడాదికి రూ.3 వేలు చెల్లిస్తే 200 ట్రిప్పులను వినియోగించుకోవచ్చు. ఈ లెక్కన ఒక టోల్‌ప్లాజా దాటడానికి కేవలం రూ.15 మాత్రమే ఖర్చవుతుంది. అయితే చాలామంది వాహనదారుల్లో రాష్ట్రంలోని జాతీయ రహదారులపై ఏ టోల్‌ప్లాజాల్లో ఈ పాస్ వర్తిస్తుందనే సందేహం వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో ఎన్‌హెచ్ఏఐ (జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ) ఆ వివరాలను తన వెబ్‌సైట్‌లో పెట్టింది. రాష్ట్రంలో మొత్తం 35 టోల్‌ప్లాజాలు పాస్ పరిధిలో ఉన్నాయి.

**ఎలా పని చేస్తుంది**

* రూ.3 వేలు చెల్లిస్తే మీ ఫాస్టాగ్‌కి 200 టోల్ క్రెడిట్స్ లేదా ఏడాది వ్యాలిడిటీ లింక్ అవుతుంది.
* ఈ పరిమితి పూర్తయిన తర్వాత మీ ఫాస్టాగ్ మళ్లీ పేపర్‌యూజ్ విధానంలోకి మారుతుంది.
* దీనికి కొత్త ఫాస్టాగ్‌ను కొనాల్సిన అవసరం లేదు. పాత దాని మీదనే అమలవుతుంది.

ప్రస్తుతం రూ.305.. పాస్ ఉంటే రూ.45 మాత్రమే

వార్షిక టోల్‌పాస్‌తో హైదరాబాద్‌విజయవాడ హైవేపై ప్రయాణించే వారికి మేలు జరగనుంది. ఈ మార్గంలో వారంలో కనీసం ఒకటి, రెండుసార్లు రాకపోకలు సాగించే ఉద్యోగులు, వ్యాపారులు చాలామందే ఉన్నారు. ప్రస్తుతం ఈ హైవేలో ఎన్‌హెచ్ఏఐ పరిధిలోని పంతంగి, కొర్లపహాడ్, చిల్లకల్లు టోల్‌ప్లాజాలు కలిపితే ఒకవైపు ప్రయాణానికే రూ.305 టోల్ చెల్లించాల్సి వస్తోంది. వార్షిక పాస్ తీసుకుంటే రూ.45 మాత్రమే ఖర్చవుతుంది.

# సీఎస్ఆర్ తరహాలో వర్సిటీలు ఏఎస్ఆర్ అమలు చేయాలి



ములుగు: ఉన్నత విద్యారంగంలో జాతీయస్థాయిలో తెలంగాణ సత్తాచాటాలని రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ బాలకిష్టారెడ్డి సూచించారు. పరిశ్రమలు అమలుచేసే సీఎస్ఆర్ తరహాలోనే విశ్వవిద్యాలయాలు అకడమిక్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (ఏఎస్ఆర్)ను అమలుచేయడం ద్వారా సమాజానికి ఉపయోగపడాలని కోరారు. ఈసారి అన్ని వర్సిటీలు అత్యుత్తమ ర్యాంకుల సాధనకు కృషిచేయాలని పిలుపునిచ్చారు. కొండాలక్ష్మణ్ ఉద్యాన వర్సిటీలో.. వర్సిటీ, ఉన్నత విద్యామండలి సంయుక్తంగా సోమవారం జాతీయ సంస్థాగత ర్యాంకింగ్ విధానాలపై నిర్వహించిన సదస్సులో ఆయన ప్రసంగించారు. విద్యా ప్రమాణాలకు జాతీయ స్థాయి ర్యాంకులు అద్దం పడతాయన్నారు. 'ప్రైవేట్, డీమ్డ్ వర్సిటీలు త్వరితగతిన నిర్ణయాలు తీసుకొని, నిధులు ఖర్చు చేస్తూ.. జాతీయ ర్యాంకింగ్‌ను పెంచుకునేందుకు పోటీ పడుతున్నాయి. ప్రభుత్వ వర్సిటీలు మాత్రం నిధుల కోసం వెతుక్కోవాల్సి వస్తోంది. పాలకమండళ్లలో తీసుకున్న నిర్ణయాల మినిట్స్ కోసం నెలల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితి. ఇక వర్సిటీల ర్యాంకింగ్ ఎలా మెరుగుపడుతుంది?' అని కొందరు ఉపకులపతులు సదస్సులో అసంతృప్తి వ్యక్తంచేశారు. విద్యామండలి ఛైర్మన్ ఉపాధ్యక్షుడు ఇటిక్యాల పురుషోత్తం, కార్యదర్శి ఆచార్య శ్రీరాం వెంకటేశ్, ఉపకులపతులు ప్రతాప్‌రెడ్డి, ఖాజా అల్తాఫ్ హుస్సేన్, కిషన్ కుమార్‌రెడ్డి, ఉద్యాన వర్సిటీ వీసీ రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో ఘనంగా.. హర్ ఘర్ తిరంగా



హైదరాబాద్: భారత ప్రభుత్వం పిలుపు మేరకు పంద్రాగస్టును పురస్కరించుకొని భాజపా 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని రాష్ట్రంలో ఘనంగా నిర్వహించేందుకు సిద్ధమైందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు అన్నారు. సోమవారం రాష్ట్ర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. 'హైదరాబాద్‌లో ఆగస్టు 14న నెక్లెస్ రోడ్డు నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు పదివేల మంది విద్యార్థులతో భారీ ర్యాలీ తీయనున్నాం. ఈ వేడుకల నిర్వహణకు పార్టీ ఉపాధ్యక్షుడు మనోహర్‌రెడ్డి నేతృత్వంలోని కమిటీలో సభ్యులుగా ఎమ్మెల్యే హరీశ్‌బాబు, ఎమ్మెల్సీ కొమరయ్య, రాణి రుద్రమ, మహేందర్ ఉన్నారు. రాష్ట్రంలో 40 లక్షల ఇళ్లపై దేశ జెండా ఎగరేయాలని నిర్ణయించాం. ఈ కార్యక్రమానికి పార్టీలకు అతీతంగా అందరూ ముందుకు రావాలి' అని పిలుపునిచ్చారు.

# సెలవులకు ఊరెళ్తున్నారా.. జరభద్రం!

* **దూర ప్రయాణాలు చేసేవారు పోలీస్ వారికి సమాచారం అందించండి**
* **ఎస్పీ రోహిత్ రాజు**




ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: వరుసగా సెలవులు రావడంతో చాలా మంది దూర ప్రయాణాలు చేస్తారు.ఇదే అదనుగా దొంగలు చేతివాటం ప్రదర్శిస్తారు.ఇంటిని వదిలి దూర ప్రయాణాలు చేసే వారు అప్రమత్తంగా ఉండాలని,ముందస్తుగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అన్నారు.ఈ నెల 15,16, 17 తారీఖులలో వరుస సెలవుల దృష్ట్యా చోరీల నియంత్రణకు అన్ని చర్యలు చేపట్టామని,జిల్లా ప్రజలను అప్రమత్తం చేస్తున్నామన్నారు.అంతర్ రాష్ట్ర దొంగల ముఠా మన జిల్లా పరిసర ప్రాంతాల్లో సంచరిస్తున్నట్లు పోలీసు వారికి సమాచారం అందిందని తెలిపారు.ఈ దొంగల ముఠా తాళం వేసి ఉన్న ఇండ్లల్లో దొంగతనాలకు పాల్పడుతున్నారని తెలిపారు. పోలీసు శాఖ తరపున రాత్రి వేళల్లో వీధుల్లో గస్తీని ముమ్మరం చేస్తున్నామన్నారు.ఈ విషయంలో జిల్లా పరిధిలోని ప్రజలు కూడా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు పలు సూచనలు చేశారు.దూర ప్రాంతాలకు వెళ్లేవారు తమ ఇంటి చిరునామా,ఫోన్ నెంబర్‌ను సంబంధిత పోలీసు స్టేషన్ అధికారులకు సమాచారం అందించాలని తెలిపారు.దీంతో వారి వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేసుకుని ఊర్లెళ్లిన వారి ఇండ్ల పరిసర ప్రాంతాల్లో నిఘాను ఏర్పాటు చేస్తామని తెలిపారు. మీరు ఇంట్లో లేని సమయంలో మీ ఇంటిని గమనిస్తూ ఉండమని మీ ఇంటి దగ్గర గల మీకు నమ్మకమైన ఇరుగు పొరుగు వాళ్ళకు చెప్పడం మంచిదన్నారు. విలువైన వస్తువుల సమాచారాన్ని,వ్యక్తిగత ఆర్థిక విషయాలను ఇతరులకు చెప్పకూడదని సూచించారు. ఇంట్లో బంగారు నగలు,నగదు ఉంటే వాటిని బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవడం క్షేమం అన్నారు.ఎక్కువ రోజులు ఊళ్లకు వెళ్లేవారు విలువైన వస్తువులను తమ వెంట తీసుకెళ్లాలి. బ్యాగుల్లో బంగారు నగలు,డబ్బు పెట్టుకొని ప్రయాణం చేస్తున్నప్పుడు బ్యాగులు తమ దగ్గరే పెట్టుకోవాలని సూచించారు.ప్రజలు నిరంతరం పోలీసులతో సమన్వయంగా సహకరిస్తే చోరీలను నియంత్రించడం చాలా సులభమని తెలిపారు.ఇండ్లలో,కాలనీల్లో దొంగతనాల నివారణకు స్వచ్ఛందంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా మన జిల్లాలోని సింగరేణి,కెటిపిఎస్, నవభారత్,ఐటిసి,బిటిపిఎస్,ఇతర ప్రభుత్వ , ప్రైవేటు కంపెనీల యాజమాన్యాలు తమ ఉద్యోగుల నివాస కాలనీలలో,గేటెడ్ కమ్యూనిటీలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకొని,పటిష్టమైన భద్రతా ఏర్పాట్లను చేసుకోవాలని సూచించారు. అనుమానాస్పద,కొత్త వ్యక్తుల కదలికలపై జిల్లా కమాండ్ కొంట్రోల్ నంబరు 8712682128 నకు గానీ,డయల్ 100 నకు గానీ ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు.

## సీఐఈ గాంధీనగర్ ఇండస్ట్రియల్ ఏరియా సర్వీస్ సొసైటీ చైర్మన్ గా ఎన్నికైనా పి.స్వామి గౌడ్ కు శుభాకాంక్షలు



జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి ) : సీఐఈ గాంధీనగర్ ఇండస్ట్రియల్ ఏరియా సర్వీస్ సొసైటీ చైర్మన్ గా పి.స్వామి గౌడ్ ఎన్నికయ్యారు. రంగారెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ బి.విజయ్ శేఖర్ గౌడ్ ఆదేశాల మేరకు నందానగర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు కార్తీక్ గౌడ్ తో పాటు స్థానిక నాయకులు సోమవారం స్వామి గౌడ్ ని వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నర్సింగ్ గౌడ్, తిరుపతిరెడ్డి, సుధాకర్ గౌడ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## బానోత్ భద్రి పార్థివ దేహానికి ఎమ్మెల్యే కోరం కనకయ్య నివాళి..



ప్రజాస్ఫూర్తి, ఇల్లందు: ఇల్లందు మండలం బోయితండా గ్రామ పంచాయితి కి సర్వేతండా గ్రామం కు చెందిన కాంగ్రెస్ నాయకులు బానోత్ రమేష్ మాతృ మూర్తి బానోత్ భద్రి ఆకస్మికంగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఇల్లందు నియోజకవర్గం శాసన సభ్యులు కోరం కనకయ్య ఇల్లందు ప్రభుత్వ ఆసుపత్రి నందు వారి పార్థివ దేహానికి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. వారితో పాటు ఇల్లందు మార్కెట్ కమిటి చైర్మెన్ బానోత్ రాంబాబు, ఇల్లందు మండల మాజీ వైస్ ఎంపిపి మండల రాము,ఈసం లక్ష్మణ్,సప్పిడి ప్రవిణ్,బండి ఆనంద్ ,రమేష్,బానోత్ జగదీష్,తారాచంద్ తదితరులు ఉన్నారు.

## రైతులు సెంద్రియా వ్యవసాయం పై దృష్టి సారించాలి

* **ఇల్లందు నియోజకవర్గం శాసన సభ్యులు కోరం కనకయ్య**




ప్రజాస్ఫూర్తి, ఇల్లందు: రైతులు తక్కువ మొత్తంలో యురియా వాడి,సెంద్రియా వ్యవసాయం పై దృష్టి సారించాలని ఇల్లందు నియోజకవర్గం శాసన సభ్యులు కోరం కనకయ్య అన్నారు. ఇల్లందు మండలం రెపల్లెవాడ గ్రామ పంచాయితి పరిధిలో రైతుల సౌకర్యార్థం సహకార సంఘం వారి అధ్వర్యంలో ఎర్పాటు చేసిన నూతన యురియా విక్రయ కేంద్రం ను ఆయన పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులందరికి సరిపడే యురియా అందుబాటులో ఉంది,తప్పుడు ప్రచారం చేసే నేతలను నమ్మవద్దన్నారు. రైతులకు ఋణ మాఫీ చేసాం,రైతు భరోసా ఇస్తున్నాం రైతుల కోసం ప్రజా ప్రభుత్వం అహర్నిశలు పనిచేస్తుందన్నారు. వారి వెంట పాల్గోన్న ఇల్లందు మార్కెట్ కమిటి చైర్మెన్ బానోత్ రాంబాబు, ఇల్లందు మండలం మాజీ వైస్ ఎంపిపి మండల రాము,సొసైటి చైర్మెన్ మెట్ల క్రిష్ణ,మండల పార్టీ అధ్యక్షుడు పులి సైదులు,నాయకులు పూనెం సురేందర్,తాటి భిక్షం,మూతి క్రిష్ణ,బండి ఆనంద్,కాకటి భార్గవ్,ఈసం లక్ష్మణ్,పూనెం శ్రీరాములు, మోకాళ్ళ వెంకటమ్మ, బానోత్ శారద, కల్తి పద్మ, పాయం లలిత, బొల్లి రామారావు, ధనుంజయ్, ప్రసన్న కుమార్, నాగార్జున్, కునుసోత్ రాము తదితరులు పాల్గోన్నారు.



## విద్యార్థులకు చదువుతో పాటు మంచి ఆరోగ్యం కూడా అత్యంత ముఖ్యం

* **జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**
* **నులిపురుగుల నివారణ మాత్రల వలన ఎలాంటి ఆరోగ్య సమస్యలు రావు**
* **కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు .**

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: విద్యార్థుల విద్యా ప్రగతికి శారీరక, మానసిక ఆరోగ్యం కీలకమని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. అంతర్జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా, సోమవారం పాల్వంచ బొల్లారిగూడెం మైనారిటీ పాఠశాలలో నిర్వహించిన జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమమునకు స్థానిక శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావుతో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.కలెక్టర్ మాట్లాడుతూ పిల్లలు ఆరోగ్యవంతంగా ఉంటేనే చదువులో పూర్తి స్థాయి దృష్టి పెట్టగలరని, అందుకే నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం ప్రాధాన్యత వహిస్తోందని తెలిపారు. నులి పురుగులు శరీరంలో ఉండటం వలన పిల్లల్లో పోషకాహార లోపం, రక్తహీనత, ఆకలి తగ్గడం, అలసట, కడుపు నొప్పి, వికారం, విరోచనాలు, బరువు తగ్గడం వంటి అనారోగ్య సమస్యలు ఎదురవుతాయని, ఇవి వారి శారీరక ఎదుగుదల, చదువులో ఏకాగ్రత, మానసిక అభివృద్ధిపై ప్రతికూల ప్రభావం చూపుతాయని వివరించారు.ఈ సమస్యలను నివారించడానికి కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంను ప్రతి సంవత్సరం విజయవంతంగా నిర్వహిస్తున్నాయని తెలిపారు. ఆల్బెండజోల్ మాత్రలు నులిపురుగులను పూర్తిగా నిర్మూలించడంలో, రోగ నిరోధక శక్తిని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు.జిల్లా వ్యాప్తంగా 1 నుండి 19 సంవత్సరాల వయస్సు గల 3,36,136 మంది పిల్లలు , యువతకు ఈ మాత్రలు అందించనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి వైద్య ఆరోగ్య శాఖతో పాటు అన్ని సంబంధిత ప్రభుత్వ శాఖలు, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ప్రతి పాఠశాల, వసతి గృహం, అంగన్వాడీ కేంద్రం, కళాశాలలో ఈ మాత్రలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ నులిపురుగుల నివారణ మాత్రల వలన ఎలాంటి ఆరోగ్య సమస్యలు రాకపోవడంతో పాటు, ఎలాంటి అపోహలు పెట్టుకోకూడదని ప్రజలకు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని కోరారు. మధ్యాహ్న భోజనం అనంతరం మాత్రలు ఇవ్వాలని, 1-2 సంవత్సరాల వయసు పిల్లలకు సగం మాత్ర, 2-19 సంవత్సరాల వారికి పూర్తి మాత్ర నమిలి మింగేలా చేయాలని సూచించారు. ఆగస్టు 18 వరకు నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా 19 ఏళ్ల లోపు ప్రతి ఒక్కరికి మాత్రలు అందించడానికి సంబంధిత శాఖలు సమన్వయంతో కృషి చేయాలని ఎమ్మెల్యే కోరారు. నులిపురుగులు పిల్లల ఆరోగ్యాన్ని దెబ్బతీసే ప్రధాన కారణమని, వాటి నివారణ ద్వారా పిల్లలు ఆరోగ్యవంతంగా, చదువులో ప్రతిభ కనబరుస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జయలక్ష్మి, సిపిఓ సంజీవరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, బోధక సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## ప్రియాంక హాస్పిటల్ ను ప్రారంభించిన మాజీ

* **చౌటుప్పల్ మున్సిపల్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు**
* **సమగ్ర మహిళల ఆరోగ్య సేవనే నాకు ముఖ్యం**
* **డాక్టర్ శ్వేతా ప్రియాంక**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: మహిళలకు అన్ని విధాలుగా అత్యంత నాణ్యమైన ఆధునిక చికిత్స అందించడమే లక్ష్యంగా డాక్టర్ శ్వేత ప్రియాంక చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం చిన్నకొండూరు రోడ్డులో, అపోలో ఫార్మసీ పక్కన ప్రియాంక హాస్పిటల్ ను మాజీ చౌటుప్పల్ మున్సిపల్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు చేతుల మీదుగా సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వెన్ రెడ్డి రాజు మాట్లాడుతూ ప్రియాంక ఆసుపత్రి ప్రజలకు ఆరోగ్యాన్ని అందిస్తూ, ఆదరణ పొందాలని ఆకాంక్షించారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన పరికరాలతో ప్రజలకు సేవలు అందించేందుకు ముందుకొచ్చిన డాక్టర్ శ్వేతా ప్రియాంకను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం డాక్టర్ శ్వేతా ప్రియాంక మాట్లాడుతూ అధునాతన సాంకేతికతతో, ఆధునిక యంత్ర పరికరాలతో మహిళలకు అన్ని విధాలుగా అత్యంత నాణ్యమైన ఆధునిక చికిత్సను అందించడమే లక్ష్యంగా చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం పోలీస్ స్టేషన్ వెనుక గత 5సంవత్సరాల నుంచి గైనకాలజిస్ట్ ప్రసూతి వైద్యురాలిగా మహిళలకు సేవలను అందిస్తున్నానన్నారు. చిన్నకొండూరు రోడ్డులోని అపోలో ఫార్మసీ పక్కన ఆసుపత్రిని ప్రారంభించడం జరిగిందని, ఇది ప్రజలు గమనించాలని కోరారు. చౌటుప్పల్ పట్టణ వ్యాప్తంగా త్రీడీ స్కానింగ్ మిషన్ సౌకర్యంతో, సమగ్ర మహిళల ఆరోగ్య సేవలకు గాను సాధారణ తనిఖీల నుంచి ప్రత్యేక చికిత్సల వరకు విస్తృత శ్రేణి స్త్రీ జననేంద్రియ సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆసుపత్రిలోని అత్యాధునిక సౌకర్యాలు, నిపుణులైన వైద్య సిబ్బంది, ప్రతి రోగికి ఆమె అవసరాలకు తగిన వ్యక్తిగతీకరించిన సంరక్షణ లభించేలా చూస్తామన్నారు. ప్రారంభోత్సవ ఆఫర్ గా ఒక వారం పాటు ఉచిత ఓపిని చూడడం జరుగుతుందన్నారు. ప్రారంభోత్సవానికి విచ్చేసిన ప్రముఖులను డాక్టర్ శ్వేతా ప్రియాంక సుధీర్ దంపతులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి, మాజీ కౌన్సిలర్లు పోలోజు శ్రీధర్ బాబు, సందగళ్ళ విజయ సతీష్ గౌడ్, బిజెపి రాష్ట్ర నాయకుడు గుజ్జుల సురేందర్ రెడ్డి, టిడిపి మాజీ మునుగోడు నియోజకవర్గ అధ్యక్షుడు బడుగు లక్ష్మయ్య, మాజీ చౌటుప్పల్ గ్రంథాలయం చైర్మన్ ఉడుగు మల్లేష్ గౌడ్, శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం అధ్యక్షుడు బొబ్బిళ్ళ మురళి, ఆవుల యేసు యాదవ్, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డిని విమర్శించే స్థాయి కాదు

- **కొలను శ్రీనివాస్ రెడ్డి**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని విమర్శించే స్థాయి చలమల్ల కృష్ణారెడ్డికి లేదని తెలంగాణ రాష్ట్ర సర్పంచుల ఫోరం ప్రధాన కార్యదర్శి కొలను శ్రీనివాస్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. చౌటుప్పల్ మండల కేంద్రంలో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఎంపీగా, ఎమ్మెల్యేగా యాదాద్రి భువనగిరి జిల్లా వ్యాప్తంగా చేసిన సేవలు మరువలేని మరువలేనన్నారు. మునుగోడు ప్రజలను కంటికి రెప్పలా కాపాడుతున్న రాజగోపాల్ రెడ్డిని విమర్శించే స్థాయి చలమల్ల కృష్ణారెడ్డికి లేదని ఆరోపించారు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేసిన సేవా కార్యక్రమాలలో, ఒక శాతం కూడా చలమల్ల కృష్ణారెడ్డి చేయలేదని, రాజగోపాల్ రెడ్డి ని విమర్శించే ముందు తన స్థాయిని చూసుకోవాలని కృష్ణారెడ్డికి చురకలు అంటించారు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి శ్వాస, ధ్యాస మునుగోడు అభివృద్ధి మాత్రమేనన్నారు. మునుగోడు ప్రాంత అభివృద్ధి అధ్యాయంగా పదవిని త్యాగం చేసిన గొప్ప నేత రాజగోపాల్ రెడ్డి అని గుర్తు చేశారు. అలాంటి వ్యక్తిని విమర్శించేముందు తన స్థాయిని తెలుసుకోవాలని చలమల్లకు సూచించారు. చలమల్ల కృష్ణారెడ్డికి కాంగ్రెస్ పార్టీకి ఎటువంటి సంబంధం లేదని, ఎన్నికల సమయంలో బిజెపిలోకి చేరి కాంగ్రెస్ పార్టీకి చేసిన నష్టాన్ని కాంగ్రెస్ పార్టీ ఎన్నటికీ మర్చిపోదన్నారు.

## మహిళలకు ఉపాధి కల్పించే వారికి తాను అండగా ఉంటా

* **మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి**



జీడిమెట్ల, (ప్రజాస్ఫూర్తి) : మహిళలకు ఉపాధి కల్పించే వారికి తాను అండగా ఉంటానని మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి అన్నారు. సూరారం కాలనీ సుందర్ నగర్ లో సీతారామయ్య నర్సింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ కరస్పాండెంట్ డాక్టర్ దాక్షాయిని మహిళల కొరకు వారికీ ఉపాధి కల్పన చెయ్యాలనే ముఖ్యఉద్దేశం తో ఏర్పాటు చేసిన మహిళా ఎంపవర్మెంట్ స్కిల్ డెవలప్మెంట్ శిక్షణ కార్యాలయాన్ని మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సురేష్ రెడ్డి మాట్లాడుతూ మహిళలు విద్య ఆర్థిక స్వయం సమృద్ధి రాజకీయ ,సామాజిక న్యాయం వంటి రంగాల్లో మెరుగుపరుచుకోవాలన్నారు. అదే లక్ష్యంగా ముందుకు సాగాలని ఆయన సూచించారు.మహిళలు అన్ని రంగాలలో ముందు ఉండేలా కృషి చేస్తున్న దక్షాయని ని చూసి అందరు నేర్చుకోవాలని అభినందనీయమని అన్నారు.ఈ కార్యక్రమంలో సీతారామయ్య, నర్సింగ్, కాలేజ్ ప్రిన్సిపాల్ కరస్పాండెంట్ డాక్టర్ దాక్షాయిని, స్థానిక మహిళ నాయకురాలు, స్థానిక మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు

## నిరుపేద కుటుంబానికి అండగా నిలిచిన స్నేహితులు

ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్:తోటి స్నేహితుడి నిరుపేద కుటుంబానికి స్నేహితులు అండగా నిలిచారు. ముస్తాబాద్ మండలం తెర్లు మద్ది గ్రామానికి చెందిన అశోక్ ఇటీవల మృతి చెందాడు. అశోక్‌తో పదో తరగతి వరకు చదువుకున్న చిన్ననాటి మిత్రులు ఆ కుటుంబానికి భరోసాగా నిలిచి రూ.31వేలు, నెలకు సరిపడే నిత్యవసర సరుకులు అశోక్ కుటుంబానికి సోమవారం అందజేశారు. భార్య, ముగ్గురు పిల్లలు చాలా దయనీయమైన పరిస్థితుల్లో ఉన్నారని ప్రభుత్వం ఆదుకోవాలని స్నేహితులు కోరారు. ఈ కార్యక్రమంలో సింగపూర్ రామ్ రెడ్డి, పాస్టర్ రాజయ్య, రాజా గౌడ్, చీకోడు దేవయ్య యాది మల్లేష్, సంతోష్ పాల్గొన్నారు.

## అనుమానస్పద స్థితిలో ఒకరు మృతి

ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ముస్తాబాద్ మండలం గూడెం గ్రామానికి చెందిన పిట్టల దేవయ్య (60) అనే వ్యక్తి అనుమానస్పద స్థితిలో మృతి చెందాడని ఎస్ఐ గణేష్ తెలిపారు. మృతుని సోదరుడు పిట్టల లస్మయ్య ఇచ్చిన ఫిర్యాదులో వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 10న దేవయ్య మద్యం సేవించి రోడ్డు మీద ఉండగా, తన కొడుకు చందు అతన్ని బలవంతంగా తీసుకొచ్చి ఇంట్లో ఉంచాడని తెలిపారు. సోమవారం మధ్యాహ్నం 12.30గంటలకు ఇంట్లో చూసే సరికి దేవయ్య ఇంట్లోనే చనిపోయి ఉన్నాడని, మృతుని మరణంపై అనుమానం ఉందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ ప్రారంభించామని ఎస్ఐ తెలిపారు.

# ప్రభుత్వ పాఠశాలలను ప్రోత్సహించడం అభినందనీయం...

* **కేరియార్ టెక్నాలజీ సేవ కార్యక్రమాలు మునుముందుకు సాగాలి...**
* **పిఆర్టియు జిల్లా అధ్యక్షుడు ఆకుల మాణయ్య**

అందోలు, ప్రజాస్ఫూర్తి :ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రోత్సహించడం అభినందనీయమని జిల్లా పిఆర్టియు అధ్యక్షుడు ఆకుల మాణయ్య అన్నారు. సోమవారం అందోలు మండల పరిధిలోని పోసానిపేట పాఠశాలలో కేరియర్ టెక్నాలజీ ఇండియా సంస్థ ఆర్థిక సహాయంతో నిర్మన్ సంస్థ నిర్మించిన అభివృద్ధి పనులను సంస్థల ప్రతినిధులు, మండల విద్యాధికారి బి. కృష్ణల తో కలిసి ప్రారంభం చేశారు. ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సుమారుగా రూ. 63 లక్షలతో తరగతి గదులు, సైన్స్ ల్యాబ్స్, సాంస్కృతిక కళావేదికల నిర్మాణం, త్రాగునీటి అవసరాల కోసం బోరుబావి త్రవ్వకం వంటి అభివృద్ధి పనులను చేపట్టినట్లు తెలుపగా పాఠశాలలో అన్ని సౌకర్యాలు ఏర్పాట్లు చేపట్టడం పట్ల విద్యార్థులందరూ నిలబడి ఒక్కసారిగా పెద్ద ఎత్తున చప్పట్లు కొడుతూ కేరియర్ మరియు నిర్మాణ్ సంస్థలకు కృతజ్ఞతలు తెలియజేశారు.




ఈ సందర్భంగా మండల విద్యాధికారి బి.కృష్ణ, టిఆర్టియు అధ్యక్షుడు మాణయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ఇలాంటి ప్రోత్సహకాలు ఎంతో అవసరమని తెలిపారు. భవిష్యత్తు తరాలకు ప్రభుత్వ పాఠశాలలు ఎంతో అవసరమని, ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని చెప్పారు. ప్రైవేట్ , కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందుతుందనడానికి నిదర్శనం ప్రభుత్వ పాఠశాలలో పెరిగిన విద్యార్థుల సంఖ్యను బట్టి చెప్పవచ్చన్నారు. కార్యక్రమంలో కేరియర్ ఆపరేషన్ లీడర్ పేరిణి శ్రీనివాస్, నిర్మాణ్ ఆర్గనైజేషన్ బాధ్యులు మాధురి, ప్రధానోపాధ్యాయులు మురళి కృష్ణ, కిరణ్ కుమారి, ఉపాధ్యాయులు కృష్ణ, శివకుమార్,మహేష్ , రాజేశ్వరి,జ్యోతి,అనిత, అనసూయ,మరియు గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

# సిపిఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

* **సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పల్లె శేఖర్ రెడ్డి**




చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: ఈ నెల 19నుంచి 22వ తేదీ వరకు హైదరాబాద్ లో నిర్వహించ తలపెట్టిన సిపిఐ రాష్ట్ర 4వ మహాసభలను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పల్లె శేఖర్ రెడ్డి పిలుపునిచ్చారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం బస్టాండ్ ఆవరణలో సిపిఐ రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పల్లె శేఖర్ రెడ్డి మాట్లాడుతూ 1925డిసెంబర్ 26న ఆవిర్భవించిన భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ నాటి నుంచి నేటి వరకు నిరంతరం పేద ప్రజల పక్షాన నిలబడి పోరాడుతూ 100సంవత్సరాలు పూర్తి చేసుకున్న పార్టీ అన్నారు. పేద ప్రజల పక్షాన నిలబడేది ఎర్రజెండా మాత్రమేనని, ప్రపంచంలో అత్యంత కార్మికులు కలిగిన పార్టీ సిపిఐ అన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సాగు, త్రాగు నీరు కోసం అనేక పోరాటాలు చేసిన చరిత్ర సిపిఐకే ఉందన్నారు. ఈ రాష్ట్ర మహాసభలలో గత పోరాటాలను సమీక్షించుకొని భవిష్యత్తు పోరాట కార్యక్రమాలను రూపొందించుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ చౌటుప్పల్ మున్సిపల్ కార్యదర్శి పగిళ్ల మోహన్ రెడ్డి, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు కలకొండ సంజీవ, సిపిఐ నాయకులు బద్దుల సుధాకర్, టంగుటూరి రాములు, కొండూరు వెంకటేష్, రొండి నరసింహ, బోయ అంకులు, దాసరి అంజయ్య, నీల బిక్షపతి, బెదరకోట యాదయ్య, దాసరి యాదయ్య, ఉబ్బు దర్శన్, దాసరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ మోసాలపై స్థానిక భాషల్లో ప్రచారం

* **కేంద్ర మంత్రి బండి సంజయ్**



దిల్లీ: సైబర్ మోసాలు పెరుగుతున్న నేపథ్యంలో గ్రామగ్రామాన స్థానిక భాషల్లో ప్రజలకు అర్థమయ్యేలా విస్తృత ప్రచారం చేయాలని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ అధికారులను ఆదేశించారు. తెలంగాణను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి అక్కడ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. భారతీయ సైబర్ నేరాల నియంత్రణ సమన్వయ కేంద్రం ఆధ్వర్యంలో అమల్లోకి తెచ్చిన సమన్వయ్ ప్లాట్‌ఫాం, సైబర్ కమాండో ప్రోగ్రాంలపై సోమవారం దిల్లీలోని తన కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... సైబర్ నేరాలకు పాల్పడే నిందితుల సిమ్‌కార్డులను తక్షణమే బ్లాక్‌చేసే అధికారాన్ని జిల్లా ఎస్పీలకు కల్పించాలని హోంశాఖ నిర్ణయించినట్లు చెప్పారు. నేరానికి పాల్పడిన అనుమానితుల కచ్చితమైన లొకేషన్లు, బ్యాంకింగ్, టెలికం సోర్స్ వివరాలను దేశంలోని అన్ని ఠాణాలకు అందించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా అధికారులు సమన్వయ్ ప్లాట్‌ఫాం, సైబర్ కమాండో ప్రోగ్రాం అమలు తీరుపై కేంద్రమంత్రికి వివరించారు. అత్యంత నైపుణ్యమున్న పోలీసు అధికారులతో కోర్‌టీమ్‌ను తయారు చేయడమే సైబర్‌కమాండో ప్రోగ్రాం లక్ష్యమని తెలిపారు. తొలిబ్యాచ్‌లో 407 మంది కమాండోలు శిక్షణ పొంది వివిధ విభాగాల్లో సేవలందిస్తున్నట్లు వెల్లడించారు. ఇందుకు మంత్రి స్పందిస్తూ ‘‘శిక్షణ పొందిన పోలీసులు... ఆయా జిల్లాల్లో ఉపాధ్యాయులు, న్యాయవాదులు, ఇంజినీర్లు, డాక్టర్లు, పాత్రికేయులు, ప్రొఫెసర్లు సహా సమాజాన్ని ప్రభావితం చేసే వారికోసం ప్రత్యేక సెమినార్లు నిర్వహించి ఈ నేరాలను ఎలా నియంత్రించాలో అవగాహన కల్పించాలి’’ అని సూచించారు.




# దొంగతనం కేసులో ఇద్దరు అరెస్ట్..

* **22 గ్రాముల బంగారం, రూ. 2.78 లక్షల సొత్తు రికవరీ**
* **వివరాలు వెల్లడించిన డిఎస్పీ రెహమాన్**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలను సోమవారం కొత్తగూడెం టూ టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు కొత్తగూడెం డిఎస్పీ రెహమాన్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఇటీవల రుద్రంపూర్ నందు వాకపల్లి రమణ అనువారి ఇంట్లో, త్రీటౌన్ ఏరియాలో ఒకరి ఇంట్లో దొంగతనం సంఘటనలు చోటు చేసుకున్నట్లు చెప్పారు. బాధితుల ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టి, సీసీఎస్ సీఐ రమాకాంత్ ఆధ్వర్యంలోని బృందం సీసీ కెమేరాలు పరిశీలించడంతోపాటు సెల్‌ఫోన్‌లు ట్రాక్ చేసి కారుకొండ రామవరం ప్రాంతానికి చెందిన నారసాని రమేష్, మాయాబజార్ ఏరియాకు చెందిన ఒర్సు కుమార్‌లను అదుపులోకి తీసుకుని విచారించినట్లు చెప్పారు. వారి వద్ద నుంచి 22 గ్రాముల బంగారు ఆభరణాలు, వెండి 268 గ్రాములు, రూ.2,78,000ల నగదు రికవరీ చేశామని వివరించారు. వీరిరువురూ కలిసి ఖమ్మం పరిసర ప్రాంతాలతోపాటు కొత్తగూడెం చుట్టుపక్కల ప్రాంతాల్లో చోరీలకు పాల్పడ్డారని, దొంగతనం చేసిన డబ్బులతో జల్సాలు చేయడం, పేకాట ఆడటం వంటివి చేస్తారని తెలిపారు. చోరీకి గురైన రూ.3 లక్షల్లో మరో రూ.22 వేలు పేకాటలో పోగొట్టుకున్నారని, వాటిని కూడా రికవరీ చేస్తామని చెప్పారు. నిందితులను విచారించి, వివరాలు



సేకరించి కోర్టులో హాజరుపర్చనున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు టూటౌన్ సీఐ ప్రతాప్, సీసీఎస్ సీఐ రమాకాంత్, ఎస్సై రామారావులను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించినట్లు డీఎస్పీ రెహమాన్ చెప్పారు. అనంతరం ఈ చోరీ కేసులను ఛేదించిన పోలీసులకు డీఎస్పీ చేతులమీదుగా నగదు రివార్డులు అందచేశారు.

**మీరు ఊరికి వెళ్తున్నారా పోలీసులకు సమాచారం ఇవ్వండి: డీఎస్పీ రెహమాన్**

ప్రజలు ఎవరైనా ఊరికి వెళ్లాలనుకునే సందర్భంలో ఆ యొక్క సమాచారం పోలీసులకు తెలియజేయాలని డీఎస్పీ రెహమాన్ కోరారు. సమాచారం ఇస్తే వారి ఇంటి సమీపంలో గస్తీ ఏర్పాటు చేస్తామని, తద్వారా దొంగతనాలు జరగకుండా నివారించవచ్చునన్నారు. ప్రజలు తమ నివాస ప్రాంతాల్లో, వ్యాపారస్తులు వ్యాపార సముదాయాల వద్ద సీసీ కెమేరాలు ఏర్పాటు చేసుకోవాలని, తద్వారా విచారణ సమయంలో నిందితులను పట్టుకోవడం సులువు అవుతుందని చెప్పారు.



# స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

* **జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.**

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెం ప్రగతి మైదానంలో జరగనున్న 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను దేశభక్తి, పండుగ వాతావరణంలో అట్టహాసంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయం సమావేశ మందిరంలో జిల్లా స్థాయి అన్ని శాఖల అధికారులతో సన్నాహక సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రగతి మైదానంలో ప్రధాన వేదిక, సీటింగ్, అతిథుల వసతులు సక్రమంగా ఉండేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని, వర్షాకాలం దృష్ట్యా వాటర్ ప్రూఫ్ టెంట్లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. వేడుక ప్రాంగణంలో 108 అంబులెన్స్, వైద్య బృందాలను సిద్ధంగా ఉంచి, అవసరమైన మందులు, ప్రథమ చికిత్స సదుపాయాలు అందుబాటులో ఉంచాలని ఆరోగ్య శాఖకు ఆదేశించారు.ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతిబింబించేలా జిల్లా ప్రగతి నివేదిక రూపొందించాలని, అలాగే వ్యవసాయం, ఉద్యానవనం, పశుసంవర్ధక, అటవీ, విద్య, వైద్యం, పంచాయతీరాజ్, ఆర్టీసీ తదితర శాఖల పనితీరును ప్రతిబింబించే స్టాల్స్ ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. ప్రోటోకాల్ ప్రకారం అధికార అతిథులకు ఆహ్వానాలు పంపించడంతో పాటు, జాతీయ పతాకం గౌరవానికి భంగం కలగకుండా అన్ని ఏర్పాట్లలో జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. విద్యార్థుల ద్వారా దేశభక్తి గీతాలు, నృత్యాలు, నాటికలు నిర్వహించి జాతీయ భావన పెంపొందించాలని కలెక్టర్ సూచించారు. ప్రశంసా పత్రాల బహూకరణ కోసం శాఖల వారీగా ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగుల పేర్లను నిర్ణీత గడువు లోపు సమర్పించాలన్నారు. అన్ని శాఖల అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి, స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు విజయవంతంగా సాగేందుకు కృషి చేయాలని, జిల్లా ప్రజల్లో జాతీయ భావన పెంపొందేలా వేడుకలు నిర్వహించాలన్నది కలెక్టర్ ఆదేశించారు. ఈ సన్నాహక సమావేశంలో అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్, ట్రైనీ కలెక్టర్ సౌరబ్ శర్మ, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, కొత్తగూడెం ఆర్డీవో మధు, జిల్లా స్థాయి అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

# బెస్ట్ జర్నలిస్ట్ అవార్డు ను అందుకున్న టి. రమేష్



జీడిమెట్ల, (ప్రజాస్ఫూర్తి) : ప్రతిభ పురాస్కారాలలో సోషల్ సర్వీస్ విభాగంలో బెస్ట్ జర్నలిస్ట్ అవార్డు కుత్బుల్లాపూర్ జర్నలిస్ట్ టి రమేష్ కు లభించింది. హ్యూమన్ రైట్స్ పబ్లిక్ ప్రొటెక్షన్ సర్వీస్ నేషనల్ కమిటీ ఆధ్వర్యంలో అందించే ప్రతిభ పురాస్కారాలలో భాగంగా ఆదివారం రవీంద్ర భారతిలో జరిగిన కార్యక్రమంలో మానేపల్లి జ్యువెలర్స్ అధినేత, స్వర్ణగిరి దేవాలయము వ్యవస్థాపకుడు మానేపల్లి రామారావు, తెలంగాణ ఆర్య వైశ్య ఫెడరేషన్ ఛైర్మెన్ కల్వ సుజాత తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఈ అవార్డు ను అందజేశారు. ఈ సందర్భంగా గత 30 సంవత్సరాలు గా జర్నలిస్టుగా పనిచేస్తూ ప్రజాసమస్యలపై, అదే విధంగా జర్నలిస్టుల సమస్యలపై అనేక పోరాటాలకు నాయకత్వం వహించారు. నాటి ఉమ్మడి నల్లగొండ నేడు యాదాద్రి జిల్లాలో వార్త, , ఆంధ్రజ్యోతి పత్రికలో పనిచేశారు. ప్రస్తుతం కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో జర్నలిస్టుగా పనిచేస్తున్న టి రమేష్ కు బెస్ట్ జర్నలిస్ట్ అవార్డు రావడం సంతోషంగా ఉందని పలువురు ప్రజాప్రతినిధులు అయనను అభినందించారు. ఈ సందర్భంగా కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్,సూరారం కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, సుభాష్‌నగర్ కార్పొరేటర్ హేమలత సురేష్‌రెడ్డి, గాజులరామారం కార్పొరేటర్ రావుల శేషగిరి, జీడీమెట్ల సి ఐ జి మల్లేష్‌లు జర్నలిస్ట్ టి రమేష్‌ను అభినందించారు.

# హరితదీక్షాపరురాలు

* **నైనిక రజువాను అభినందించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు**
* **ఎస్పీకి మొక్కను అందించిన నైనిక రజువా, మొక్కల రాజశేఖర్**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ప్రకృతి హరిత దీక్షలో భాగంగా వందలాది మొక్కలు నాటి, వివిధ సభలు, సమావేశాలలో పాల్గొన్నవారికి మొక్కలు అందజేస్తూ పర్యావరణ పరిరక్షణకు విశేష కృషి చేస్తున్న ప్రకృతి హరిత దీక్షాపరురాలు, కొత్తగూడెం సెయింట్ మేరీస్ పాఠశాల 6వ తరగతి విద్యార్థిని నైనిక రజువాను జిల్లా ఎస్పీ బి. రోహిత్ రాజు ప్రత్యేకంగా అభినందించారు. సోమవారం గ్రీన్ మోటార్ వెహికిల్ గార్డెన్ వ్యవస్థాపకులు, ప్రకృతి ప్రేమికులు, సింగరేణియన్ మొక్కల రాజశేఖర్‌తో కలిసి నైనిక రజువా సోమవారం జిల్లా ఎస్పీని కలిసి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా నైనికను ఎస్పీ పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు. ప్రధానమంత్రి శ్రీకారం చుట్టిన ‘ఏక్ పేడ్ మాకే నామ్‘ కార్యక్రమం నుంచి ప్రేరణ పొంది 2024 నుంచి పచ్చదనాన్ని పెంపొందించే లక్ష్యంతో మొక్కల రాజశేఖర్ సహకారంతో మొక్కలు నాటడం, గింజలు సేకరించడం వంటి కార్యక్రమాలను చేపడుతున్నట్లు నైనిక ఎస్పీకి వివరించింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణలో చిన్న నాటి నుంచే భాగస్వామ్యం కావడం ఆదర్శనీయమని, ఇలాంటి సేవా కార్యక్రమాలను అందరూ ప్రోత్సహించాలని సూచించారు. భవిష్యత్తులో నైనిక రజువా చేపట్టే కార్యక్రమాలకు సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.



# ప్రముఖ రచయిత్రి అనిశెట్టి రజిత కన్నుమూత...

మహిళా సమానత్వం, స్త్రీ విముక్తి కోసం అనేక రచనలు చేసిన ప్రముఖ రచయిత్రి అనిశెట్టి రజిత(65) సోమవారం రాత్రి గుండెపోటుతో మృతిచెందారు. అవివాహితురాలైన ఆమె హనుమకొండలోని గోపాల్‌పూర్‌లోని తన స్నేహితురాలి ఇంట్లో కన్నుమూశారు. రజిత బాల్యం నుంచే ఆకాశవాణిలో ప్రసారమయ్యే ప్రముఖ రచయితల ప్రసంగాలకు ఆకర్షితురాలై రచనలు చేయడం ప్రారంభించారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో తన రచనల ద్వారా ప్రజలను చైతన్యం చేశారు. 2017లో తెలంగాణ ప్రభుత్వం ఆమెకు రాష్ట్ర విశిష్ట మహిళా పురస్కారం ప్రదానం చేసింది. ఆమె 1973లో ‘చైతన్యం పడగెత్తింది’ అనే రచనతో మొదలుపెట్టి 500కిపైగా కవితలు, 109 వ్యాసాలు, 38 పాటలు రచించారు. ఇరవైకిపైగా పురస్కారాలు అందుకున్నారు. కాకతీయ విశ్వవిద్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేశారు. మరణానికి ముందే ఆమె తన దేహాన్ని వైద్యవిద్యార్థుల అధ్యయనం కోసం దానం చేశారు.

# మరో 476 పార్టీల రద్దుకు ఈసీ చర్యలు.. జాబితాలో తెలుగు రాష్ట్రాల నుంచి 26 పార్టీలు!

దిల్లీ: చట్టబద్ధమైన నిబంధనలను ఉల్లంఘించే రాజకీయ పార్టీలపై ఈసీ కఠిన చర్యలు చేపడుతోంది.దేశవ్యాప్తంగా మరో 476 పార్టీలను రద్దు చేసే దిశగా చర్యలను మొదలు పెట్టినట్లు కేంద్ర ఎన్నికల సంఘం వెల్లడించింది. ఇటీవల 334 పార్టీలను రద్దు చేసిన ఈసీ.. తాజాగా రెండో రౌండ్‌లో మరో 476 పార్టీలను గుర్తించి.. వాటిపై వేటు వేసే ప్రక్రియను కొనసాగిస్తోంది. తాజాగా డీలిస్ట్ చేసేందుకు గుర్తించిన పార్టీల జాబితాలో ఏపీ నుంచి 17 పార్టీలు ఉండగా.. తెలంగాణ నుంచి 9 పార్టీలు ఉన్నట్లు ఈసీ పేర్కొంది. ఈ మేరకు రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల వారీగా జాబితాను విడుదల చేసింది. ఎన్నికల వ్యవస్థను క్లీన్ చేసేందుకు చేపట్టిన సమగ్రమైన వ్యూహాల్లో భాగంగా ఈ చర్యలు చేపడుతున్నట్లు ఈసీ పేర్కొంది. 2019 నుంచి ఆరేళ్లలో ఒక్క ఎన్నికల్లోనైనా పోటీ చేయాలనే ముఖ్యమైన షరతును నెరవేర్చడంలో విఫలమైన రిజిస్టర్డ్ గుర్తింపు లేని రాజకీయ పార్టీలను గుర్తించేందుకు, జాబితా నుంచి తొలగించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపింది. ఇందులో భాగంగానే తొలి రౌండ్‌లో ఆగస్టు 9న 334 పార్టీలను జాబితా నుంచి తొలగించగా.. రెండో రౌండ్‌లో మరో 476 పార్టీలను గుర్తించినట్లు వెల్లడించింది. తాము డీలిస్ట్ చేసిన పార్టీలేవీ.. ప్రజాప్రాతినిధ్య చట్టం 1951లోని సెక్షన్ 29సీ, 29బీ ఆదాయపన్ను చట్టం 1961, ఎన్నికల గుర్తులు (రిజర్వేషన్ అండ్ ఎలాట్‌మెంట్) ఆర్డర్ 1968 కింద ఉన్న ప్రయోజనాలను పొందలేవని ఇటీవల ఈసీ స్పష్టం చేసిన విషయం తెలిసిందే.



# ఎయిర్ చీఫ్ మార్షల్ వ్యాఖ్యలపై డీప్‌ఫేక్ వీడియో: ఖండించిన కేంద్రం

ఆపరేషన్ సిందూర్ సమయంలో జరిగిన వైమానిక దాడుల్లో భారత్ కొన్ని విమానాలు కోల్పోయినట్లు ఎయిర్ చీఫ్ మార్షల్ అమన్‌ప్రీత్ సింగ్ అంగీకరించినట్లుగా జరుగుతున్న నకిలీ ప్రచారాన్ని కేంద్రం ఖండించింది. ఇటీవల ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. భారత సైన్యం పాకిస్థాన్‌కు చెందిన కనీసం ఐదు యుద్ధ విమానాలను కూల్చేసినట్లు వెల్లడించిన విషయం తెలిసిందే. కానీ, ఆయన వ్యాఖ్యల్ని వక్రీకరిస్తూ భారత్ కొన్ని విమానాలు నష్టపోయినట్లు చిత్రీకరించేలా ఓ నకిలీ వీడియో ఆన్‌లైన్‌లో షేర్ అవుతోంది. దీనిపై స్పందించిన కేంద్రం.. ఇది ఏఐ జెనరేటెడ్ డీప్‌ఫేక్ వీడియో అని తేల్చి చెప్పింది. ఎయిర్ చీఫ్ మార్షల్




వ్యాఖ్యల్ని వక్రీకరించారని స్పష్టం చేస్తూ పీఐబీ 'ఫ్యాక్ట్‌చెక్' విభాగం పోస్టు పెట్టింది. ఒరిజినల్ వీడియో, డీప్‌ఫేక్ వీడియోను పక్కపక్కన పెట్టి పోస్టు చేసింది.

# చైనా మరో భారీ ప్రాజెక్టు.. భారత్ సరిహద్దు సమీపంలో రైల్వేలైన్!

సరిహద్దు వెంట మౌలిక సదుపాయాల కల్పనను ముమ్మరం చేస్తున్న చైనా తాజాగా మరో కీలక ప్రాజెక్టుకు సన్నద్ధమవుతోంది. భారత సరిహద్దు సమీపంలో భారీ రైల్వేలైన్ పనులు చేపట్టనున్నట్లు సమాచారం. టిబెట్‌ను షిన్‌జాంగ్ ప్రావిన్స్‌తో కలుపుతూ నిర్మించనున్న ఈ రైల్వే మార్గంలోని కొన్ని భాగాలు వాస్తవాధీన రేఖ (LAC) సమీపం నుంచి వెళ్లనున్నాయి. దీంతో భారత్ సరిహద్దు ప్రాంతంలో ఈ ప్రాజెక్టుకు రక్షణపరమైన ప్రాముఖ్యం ఏర్పడుతుందని స్థానిక మీడియా పేర్కొంది. షిన్‌జాంగ్‌లోని హోటాన్, టిబెట్‌లోని లాసాలను కలుపుతూ చేపట్టనున్న రైల్వే లింక్ నిర్మాణ పనులు ఈ ఏడాది ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయని 'సౌత్ చైనా మార్నింగ్



పోస్ట్' తెలిపింది. దీనికోసం 95 బిలియన్ యువాన్ల (రూ.1.15 లక్షల కోట్లు) మూలధనంతో 'ది షిన్‌జాంగ్‌టిబెట్ రైల్వే కంపెనీ'ని అధికారికంగా రిజిస్టర్ చేసినట్లు ప్రభుత్వ ఆధ్వర్యంలోని 'షాంఘై సెక్యూరిటీస్ న్యూస్'ను ఉటంకిస్తూ వెల్లడించింది. ఈ రైల్వే మార్గంలోని కొన్ని భాగాలు చైనా భారత్ సరిహద్దులోని ఎల్ఏసీ సమీపం నుంచి వెళ్లనున్నాయని.. తద్వారా అంతగా అభివృద్ధి చెందని ఆ సరిహద్దు ప్రాంతంలో రక్షణపరమైన ప్రాముఖ్యాన్ని అందిస్తాయని పేర్కొంది. తూర్పు లద్దాఖ్‌లో భారత్ చైనా సైనికుల మధ్య ఘర్షణల కారణంగా దెబ్బతిన్న సంబంధాలను సాధారణ స్థితికి తీసుకొచ్చేందుకు ఇరుదేశాలు చర్యలు తీసుకుంటున్న వేళ.. ఈ రైల్వే లింక్ విషయంలో బీజింగ్ ముందడుగు వేయడం గమనార్హం. ఇదిలా ఉండగా.. టిబెట్‌లోని యార్లంగ్ జాంగ్బో (బ్రహ్మపుత్ర) నదిపై చైనా ఇటీవల భారీ జల విద్యుత్తు ప్రాజెక్టు నిర్మాణాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. దీనిపై భారత్, బంగ్లాదేశ్‌లు ఆందోళన వ్యక్తం చేస్తున్నప్పటికీ.. డ్రాగన్ మాత్రం మొండిగా ముందుకు పోతున్నట్లు కనిపిస్తోంది.

# స్పష్టమైన ఓటర్ల జాబితాను డిమాండ్ చేస్తున్నా: రాహుల్ గాంధీ

ప్రతి భారతీయుడికి ఓటు హక్కు కోసం ప్రతిపక్షాలు నిరసన తెలుపుతున్నాయని, స్పష్టమైన ఓటర్ల జాబితాను విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నానని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. కర్ణాటకలో తమ పార్టీ అధికారంలోకి వచ్చాక ఓ నియోజక వర్గంలో సర్వే నిర్వహించగా.. దాదాపు లక్ష నకిలీ ఓట్లు తేలాయన్నారు. ఈ నిజం దేశం ముందున్నా .. ఎన్నికల సంఘం మాత్రం దీనిపై మౌనం వహించడం ఆశ్చర్యంగా ఉందన్నారు. బిహార్‌లో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణను వ్యతిరేకిస్తూ దేశ రాజధాని దిల్లీలో విపక్ష ఎంపీలు 'పార్లమెంట్ టు ఈసీ' ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీకి అనుమతి లేదంటూ పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో ప్రతిపక్ష ఎంపీలు బారికేడ్లు ఎక్కి నిరసన వ్యక్తం చేశారు. దీంతో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ సహా విపక్ష ఎంపీలను



అదుపులోకి తీసుకుని అక్కడి నుంచి బస్సులో తరలించారు. ఇది రాజకీయ పోరాటం కాదు, రాజ్యాంగ పరిరక్షణ కోసం పోరాడుతున్నామని ఆయన తెలిపారు. 'ఒక మనిషి , ఒక ఓటు' కోసం ఈ పోరాటం చేస్తున్నామన్నారు. స్పష్టమైన ఓటర్ల జాబితాను విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నామని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు.

# రైల్వే స్టేషన్లలో ఉచిత Wi-Fi.. ఎలా పొందాలంటే?

భారత ప్రభుత్వం చేపట్టిన డిజిటల్ ఇండియా కార్యక్రమాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు భారత రైల్వేశాఖ మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై దేశవ్యాప్తంగా ఉన్న దాదాపు 6,115 రైల్వే స్టేషన్లలో ప్రయాణికులకు మరింత వేగవంతమైన హైస్పీడ్ వైఫై సౌకర్యం కల్పిస్తున్నట్లు రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్ ప్రకటించారు. న్యూదిల్లీ, అహ్మదాబాద్, ముంబయి, కాచిగూడ, సికింద్రాబాద్ మొదలైన 6,115 రైల్వే స్టేషన్లలో సహా ఈ సేవలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. రైల్వే సౌకర్యాలపై రాజ్యసభలో ఓ ఎంపీ అడిగిన ప్రశ్నకు లిఖిత పూర్వక సమాధానంలో ఆయన ఈ విషయాలు వెల్లడించారు. ఈ వైఫై సదుపాయంతో ప్రయాణికులు సినిమాలు, పాటలు, గేమ్స్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చని.. అత్యవసరమైన సమయాల్లో స్టేషన్ పరిసరాల్లో ఆఫీస్ వర్క్ కూడా చేసుకోవచ్చని అన్నారు.




రైల్వే సహకార సంస్థ 'రైల్‌టెల్' సహకారంతో దీనిని అందిస్తున్నట్లు తెలిపారు ప్రయాణికులకు సౌకర్యవంతమైన సదుపాయాలు అందించడంలో భాగంగా ఈ చర్యలు తీసుకున్నామన్నారు.

*** రైల్వే స్టేషన్లలో ఉచిత Wi-Fiని ఎలా పొందాలి?**

* స్మార్ట్‌ఫోన్‌లలో ముందుగా వైఫై మోడ్‌ను ఆన్ చేయాలి
* ఆప్షన్‌లలో RailWire WiFi నెట్‌వర్క్‌ను ఎంచుకోవాలి
* అందులో ఫోన్ నెంబర్‌ను ఎంటర్ చేయాలి
* SMS ద్వారా ఫోన్‌కు వన్‌టైమ్ పాస్‌వర్డ్ (OTP) వస్తుంది
* ఫోన్‌కు వచ్చిన ఓటీపీని నమోదు చేస్తే హైస్పీడ్ WiFi కనెక్ట్ అవుతుంది.



# 'రతన్ టాటా ఉండి ఉంటే ఇలా జాప్యం జరిగేది కాదు..'

ఎయిరిండియా విమాన ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.కోటి రూపాయల చొప్పున పరిహారం ప్రకటించిన విషయం తెలిసిందే. ప్రమాదం జరిగి మూడు నెలలైనా బాధిత కుటుంబాలకు పరిహారం అందజేయకపోవడంపై పలువురు విమర్శలు వ్యక్తం చేస్తున్నారు. పరిహారం ఇవ్వడంలో జరుగుతున్న జాప్యంపై దాదాపు 65 బాధిత కుటుంబాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న యూఎస్ న్యాయవాది మైక్ ఆండ్రూస్ విమర్శలు గుప్పించారు. టాటా గ్రూప్ మాజీ ఛైర్మన్ రతన్ టాటా ఉండి ఉంటే పరిహారం విషయంలో ఇంత ఆలస్యం జరిగేది కాదని వ్యాఖ్యానించారు. ఇతరుల పట్ల కరుణతో ఉండే రతన్ టాటా ఇప్పుడు ఉండి ఉంటే బాధిత కుటుంబాలు ఎదుర్కొంటున్న మానసిక క్షోభను ఆయన గుర్తించేవారని న్యాయవాది మైక్ ఆండ్రూస్ అభిప్రాయపడ్డారు. తన ఉద్యోగులను సొంత కుటుంబ సభ్యుల్లా చూసుకునే ఆయన.. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన ప్రయాణికులు, విద్యార్థుల కుటుంబాలకు వెంటనే న్యాయం చేసేవారన్నారు. ఓ విమాన ప్రమాద మృతుడి తల్లికి సంబంధించిన పరిస్థితిని ఆండ్రూస్ ప్రస్తావించారు. తన బాగోగులు చూసుకునే ఒక్కగానొక్క కుమారుడు ప్రాణాలు కోల్పోవడంతో ఆర్థికంగా, ఆరోగ్యపరంగా, మానసికంగా ఆమె అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇప్పుడు ఆమె అవసరాలు ఎవరు తీరుస్తారని ప్రశ్నించారు. జూన్ 12న అహ్మదాబాద్ నుంచి లండన్ బయల్దేరిన ఎయిరిండియా విమానం టేకాఫ్ అయిన కొద్దిసేపటికే కూలిపోయిన సంగతి తెలిసిందే. ప్రమాద సమయంలో విమానంలో 242 మంది ఉండగా.. ఒక్క ప్రయాణికుడు మినహా అందరూ ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రమాదంలో మృతుల కుటుంబాలకు టాటాసన్స్ రూ.కోటి చొప్పున పరిహారం ప్రకటించింది. దీంతోపాటు బాధిత కుటుంబాల తక్షణ ఆర్థిక అవసరాలు తీర్చేందుకు వీలుగా రూ.25 లక్షల చొప్పున మధ్యంతర సాయం అందిస్తున్నట్లు తెలిపింది. అయితే ప్రమాదం జరిగి మూడు నెలలు అవుతున్నా పరిహారం ఇవ్వకుండా ఆలస్యం చేస్తున్నారని..దానికోసం ఆర్థిక వివరాలు చెప్పాలంటూ తమను బలవంతపెడుతున్నారని ఇటీవల బాధిత కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేశాయి. దీనిపై ఎయిరిండియా స్పందిస్తూ.. మృతులతో దరఖాస్తుదారులకు ఉన్న బంధాన్ని తెలుసుకునేందుకే మేం ఆ ప్రశ్నావళిని పంపించామని.. పరిహారం విషయంలో తమకు కొన్ని విధివిధానాలు ఉన్నాయని తెలిపింది.

## పురుషులకు పోస్టులు రిజర్వ్ చేయడమా?

# ఆర్మీ నియామకాలపై సుప్రీం ఆగ్రహం

దిల్లీ: భారత సైన్యంలోని జడ్జి అడ్వొకేట్ జనరల్ (లీగల్) బ్రాంచి పోస్టుల్లో నియామకాల కోసం అనుసరిస్తున్న 2:1 రిజర్వేషన్ నిష్పత్తి విధానం సరికాదని సుప్రీంకోర్టు తెలిపింది. దాన్ని అమలు చేయకూడదని తేల్చి చెప్పింది. మహిళలపై పరిమితి పెట్టి ఖాళీ పోస్టులను పురుషులకు రిజర్వ్ చేయకూడదని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. సైన్యంలోని జడ్జి అడ్వొకేట్ జనరల్ లీగల్ పోస్టుల కోసం జరిగిన పరీక్షల్లో అర్షూర్ కౌర్, ఆస్థ త్యాగీ అనే మహిళా అధికారులు వరుసగా 4, 5వ ర్యాంకులు సాధించారు. అయినప్పటికీ వీరిని విధుల్లోకి తీసుకోకపోవడంతో సుప్రీంకోర్టును ఆశ్రయించారు. పురుష అభ్యర్థులకన్నా తమకు మెరిట్ ఎక్కువగా ఉన్నప్పటికీ.. మహిళల కోటాల్లో ఖాళీలు లేవంటూ తమను ఎంపిక చేయలేదని



ఆవేదన వ్యక్తం చేశారు. వీరి పిటిషన్‌పై గతంలో విచారణ జరిపిన న్యాయస్థానం అప్పుడు తీర్పును రిజర్వ్ చేసింది. తాజాగా ఈ అంశంపై తీర్పు వెలువరించిన సుప్రీం ధర్మాసనం.. ఆర్మీ ఉన్నతాధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేసింది. ''ఈ విభాగంలో పురుషులకు 6.. మహిళలకు 3 పోస్టులు కేటాయించాలని నిష్పత్తి పెట్టడం ఏకపక్ష నిర్ణయం. లింగ తటస్థతకు నిజమైన అర్థం.. స్త్రీ, పురుష భేదం లేకుండా అత్యంత ప్రతిభావంతులైన అభ్యర్థులను ఎంపిక చేయడమే. అంతేగానీ, ఇలా మహిళలకు సీట్లను పరిమితం చేయడం సమానత్వ హక్కును ఉల్లంఘించడమే అవుతుంది. మహిళలపై పరిమితి పెట్టి.. ఖాళీ పోస్టులను పురుషులకు రిజర్వ్ చేయడం సమంజసం కాదు'' అని సుప్రీంకోర్టు వెల్లడించింది. ఇలాంటి విధానాలను అనుసరిస్తే ఏ దేశం భద్రంగా ఉండబోదని ధర్మాసనం అభిప్రాయపడింది. ఇకపై సమానత్వ పద్ధతిలోనే నియామకాలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఎంపిక ప్రక్రియలో భాగంగా స్త్రీ, పురుష అభ్యర్థుల మెరిట్ జాబితాను బహిర్గతం చేయాలని సూచించింది.

## ప్రమాదం అంచుల వరకు వెళ్లొచ్చాం

# విమానం దారిమళ్లింపుపై ఎంపీ కేసీ వేణుగోపాల్ పోస్ట్

కాంగ్రెస్ సీనియర్ ఎంపీ కేసీ వేణుగోపాల్ సహా పలువురు ఎంపీలు, ఇతర ప్రయాణికులు వెళ్తున్న ఓ ఎయిరిండియా విమానంలో సాంకేతిక సమస్య ఎదురైంది. దీంతో విమానాన్ని దారిమళ్లించి అత్యవసరంగా దించేశారు. దీనిపై కేసీ వేణుగోపాల్ ఎక్స్ వేదికగా స్పందించారు. తమకు భయానక అనుభవం ఎదురైందని, ప్రమాదం అంచుల వరకు వెళ్లొచ్చామని అన్నారు. కేరళ రాజధాని తిరువనంతపురం నుంచి ఆదివారం రాత్రి దిల్లీ బయల్దేరిన ఎయిరిండియా ఏఐ2455 విమానంలో సాంకేతిక సమస్య ఏర్పడింది. అప్రమత్తమైన పైలట్లు వెంటనే విమానాన్ని చెన్నై మళ్లించి ఎమర్జెన్సీ ల్యాండింగ్ చేశారు. అయితే, ఆ సమయంలో మరో విమానం కూడా అదే రన్‌వేపైకి వచ్చిందని, దీంతో తాము తీవ్ర భయాందోళనకు గురయ్యామని కేసీ వేణుగోపాల్ వెల్లడించారు. ''ఎయిరిండియా విమానంలో నేను, మరికొంతమంది ఎంపీలు, వందల మంది ప్రయాణికులు భయానక ప్రమాదం అంచుల వరకు వెళ్లొచ్చాం. అప్పటికే విమానం ఆలస్యంగా బయల్దేరింది. టేకాఫ్ అయిన కొద్దిసేపటికే విమానంలో కుదుపుల కారణంగా అలజడి మొదలైంది. గంట తర్వాత కెప్టెన్ ఓ ప్రకటన చేశారు. సిగ్నల్ వ్యవస్థలో లోపం కారణంగా విమానాన్ని చెన్నై మళ్లిస్తున్నట్లు చెప్పారు. ల్యాండింగ్‌కు అనుమతి రాకపోవడంతో దాదాపు రెండు గంటల పాటు ఎయిర్‌పోర్టు చుట్టూనే మా విమానం గింగిరాలు తిరిగింది. ఆ తర్వాత ఏటీసీ అనుమతితో రన్‌వేపై దిగేందుకు ప్రయత్నిస్తుండగా సరిగ్గా అదే సమయంలో మరో విమానం అక్కడే కన్పించింది. గమనించిన కెప్టెన్ వెంటనే ల్యాండింగ్‌ను నిలువరించి మా అందరి ప్రాణాలను కాపాడారు. రెండో ప్రయత్నంలో విమానం సురక్షితంగా కిందకు దిగింది. మా అదృష్టం, పైలట్ల చాకచక్యంతో మేమంతా బతికిపోయాం'' అని కేసీ వేణుగోపాల్ తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. ప్రయాణికుల భద్రత ఇలా అదృష్టంపై ఆధారపడే పరిస్థితి రాకూడదని కాంగ్రెస్ ఎంపీ అన్నారు. దీనిపై తక్షణమే దర్యాప్తు జరిపించాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు




తీసుకోవాలని డీజీసీఏ, కేంద్ర పౌరవిమానయాన మంత్రిత్వ శాఖను కోరారు. దీనిపై ఎయిరిండియా స్పందించింది. విమానం సురక్షితంగా దిగిందని, ప్రయాణికులందరు తమ గమ్యస్థానాలకు చేరేలా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామని వెల్లడించింది. ఈ అసౌకర్యానికి క్షమించాలని కోరింది. అయితే, ఎంపీ చెబుతున్నట్లుగా ల్యాండింగ్ సమయంలో రన్‌వేపై మరే ఇతర విమానం లేదని స్పష్టం చేసింది. ఆదివారం రాత్రి 8 గంటలకు కేరళ నుంచి బయల్దేరిన ఈ విమానం రాత్రి 10.35 గంటలకు చెన్నైలో దిగింది.

# మీరు నిజంగా రామ భక్తులైతే.. అంటూ బీజేపీపై నిప్పులు చెరిగిన మంత్రి సీతక్క

బీజేపీ నాయకులు నిజంగా రామ భక్తులైతే.. ఎన్నికల కమిషన్ ద్వారా ఓటర్ల లిస్టును బయట పెట్టాలని మంత్రి సీతక్క సవాల్ చేశారు. అప్పుడు దొంగ ఓట్లు ఎన్ని అసలు ఓట్లు ఎన్నో తెలిపోతుంది.. కాని బీజేపీ ఆ పని చేయదని విమర్శించారు. సోమవారం పార్లమెంట్ ఆవరణలో రాహుల్ గాంధీ, కాంగ్రెస్ నేతల అరెస్టును మంత్రి సీతక్క ఖండించారు. ఈ సందర్భంగా ములుగులో మంత్రి సీతక్క మీడియాతో మాట్లాడారు. బీజేపీపై నిప్పులు చెరిగారు. రామ రాజ్యం అంటే దొంగ ఓట్లతో దొడ్డిదారిన అధికారంలోకి రావడమా? అని



ప్రశ్నించారు. జై శ్రీరామ్ నినాదాలిస్తూ ప్రజా తీర్పును మార్చి పదవులు పొందడమా? అని నిలదీశారు. ప్రజా తీర్పును దొంగిలించి బీజేపీ దొడ్డిదారిన అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. రాహుల్ గాంధీ ఆధారాలతో సహ బయటపెడితే బీజేపీ తట్టుకోలేక పోతుందని, అణిచివేతలను ఆయుధంగా ఎంచుకుని అరెస్టులు చేయిస్తోందని మండిపడ్డారు. హర్యానా, ఛత్తీస్‌గడ్, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో కాంగ్రెస్ గెలుస్తుందని అన్ని సర్వేలు చెప్పాయని గుర్తుచేశారు. ప్రజా తీర్పు అదే విధంగా ఉందని, కాని దొంగ ఓట్లతో ఫలితాలను బీజేపీ తారు మారు చేసిందని ఆరోపించారు. లక్షల సంఖ్యలో దొంగ ఓట్లను నమోదు చేసి అక్రమ పద్దతుల్లో గెలుస్తోందన్నారు. ఎన్నికల కమిషన్ తప్పులను రాహుల్ గాంధీ నిలదీస్తుంటే వారిని అరెస్టు చేస్తున్నారని అన్నారు. ఈడీ, సీబీఐ, ఐటీ లాంటి కేంద్ర సంస్థలను జేబు సంస్థలుగా బీజేపీ మార్చుకుందని ఆరోపించారు. ఇప్పుడు ఎన్నికల కమీషన్ ను తన అధికారం కోసం వాడుకుంటోందన్నారు. ఓటు అనేది రాజ్యంగం కల్పించిన బలమైన ఆయుధం అని, కాని ఇప్పుడు ఆ ఆయుధాన్ని కూడా దొంగిలించి బీజేపీ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని మండిపడ్డారు.

## పాత పద్ధతిలోనే టెన్త్ పరీక్షలు.. ఇంటర్నల్ మార్కులపై విద్యాశాఖ నిర్ణయం

హైదరాబాద్: పాత పద్ధతిలోనే పదో తరగతి పరీక్షలు నిర్వహిస్తామని తెలంగాణ విద్యాశాఖ వెల్లడించింది. 20 శాతం ఇంటర్నల్ మార్కుల విధానం కొనసాగించాలని నిర్ణయించినట్లు తెలిపింది. పదో తరగతి పరీక్షల్లో 80 శాతం ఎక్స్‌టర్నల్ మార్కులు, 20 శాతం ఇంటర్నల్ మార్కులు కేటాయించనున్నట్లు విద్యాశాఖ పేర్కొంది. ఈ మేరకు విద్యాశాఖ సంచాలకులు ఆదేశాలు జారీ చేశారు. పదో తరగతిలో ఇంటర్నల్ మార్కులు ఉన్నాయా? లేవా? అనే అంశంపై విద్యార్థులు, తల్లిదండ్రుల్లో తీవ్ర ఉత్కంఠ కొనసాగుతున్న విషయం తెలిసిందే. రాష్ట్రంలో దాదాపు 5 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురుచూశారు. ఇంటర్నల్ మార్కులను తొలగిస్తూ గత ఏడాది నవంబరులో ప్రభుత్వం జీవో జారీ చేసింది.



అయితే, ఇటీవల దిల్లీలో జాతీయ విద్యా పరిశోధన, శిక్షణ మండలి నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఈ నిర్ణయంపై ప్రశ్నలు తలెత్తడంతో పునరాలోచనలో పడిన పాఠశాల విద్యాశాఖ అధికారులు.. పాత విధానాన్నే కొనసాగిస్తూ నిర్ణయం తీసుకున్నారు.

## సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో గొలుసులు కొట్టేసి.. బెట్టింగ్‌లో పెట్టి..

* **దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్**

రెజిమెంటల్ బజార్: సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో గొలుసు దొంగతనాలకు పాల్పడుతున్న లవరాజు అనే వ్యక్తిని రైల్వే పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి రూ.7,70,000 విలువైన బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఈ కేసు వివరాలను సికింద్రాబాద్ రైల్వే డీఎస్పీ జావెద్ మీడియాకు వివరించారు. ''ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ జిల్లా శంఖవరం మండలం జగ్గంపేటకు చెందిన కోరుప్రోలు లవరాజు (23) మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా జీడిమెట్ల పరిధి సూరారంలో నివాసం ఉంటూ ఓ ప్రైవేటు సంస్థలో పనిచేస్తున్నాడు. కొంతకాలంగా మద్యం, బెట్టింగ్, ఆన్‌లైన్ గేమ్స్‌కు బానిస అయ్యాడు. వీటన్నింటికీ తనకు వచ్చే జీతం సరిపోకపోవడంతో దొంగతనాలకు అలవాటు పడ్డాడు. రద్దీగా ఉన్న రైళ్లను ఎంపిక



చేసుకుని మహిళల మెడలో బంగారు గొలుసులు దొంగిలించడం మొదలుపెట్టాడు. తద్వారా వచ్చిన డబ్బును బెట్టింగ్‌లో పెట్టాడు. ఈ క్రమంలో ఈ ఏడాది ఫిబ్రవరి 26న సింహపురి ఎక్స్‌ప్రెస్, ఆగస్టు 2న గౌతమి ఎక్స్‌ప్రెస్‌లో బంగారు గొలుసులు చోరీ చేశాడు. బాధితుల ఫిర్యాదులతో రైల్వే ఎస్పీ చందనాదీప్తి ఆదేశాల మేరకు ఇన్‌స్పెక్టర్ సాయి ఈశ్వర్‌గౌడ్, ఎస్సై సుబ్బారెడ్డి, ఆర్పీఎఫ్‌తో కలిసి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు. సోమవారం ఉదయం 7 గంటల సమయంలో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించాడు'' అని డీఎస్పీ వెల్లడించారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు తెలిపారు.



## హైదరాబాద్‌లో మళ్లీ వర్షం.. వాహనదారుల ఇక్కట్లు

హైదరాబాద్: నగరంలో మళ్లీ వర్షం కురుస్తోంది. కూకట్‌పల్లి, జగద్గిరిగుట్ట, కుత్బుల్లాపూర్, దుండిగల్, సనత్‌నగర్, పంజాగుట్ట, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, బోయిన్‌పల్లి, అల్వాల్, ప్యాట్నీ, చిలకలగూడ, కోఠి, దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీనగర్, వనస్థలిపురం, హయత్‌నగర్ తదితర ప్రాంతాల్లో వర్షం పడుతోంది. పలుచోట్ల వర్షపు నీరు రోడ్లపై నిలిచిపోయింది. కార్యాలయాల నుంచి ఉద్యోగులు ఇళ్లకు వెళ్లే సమయం కావడంతో కొన్నిచోట్ల ట్రాఫిక్ జామ్ అవుతోంది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

## గొప్ప ఆశయంతో ఆ స్కీమ్‌ను కొనసాగిస్తున్నాం : మంత్రి పొన్నం ఆసక్తికర వ్యాఖ్యలు

ప్రజాభవన్‌లో సింగరేణి ఆధ్వర్యంలో మెయిన్స్‌కు ఎంపికైన 180 మందికి రూ.లక్ష చొప్పున ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొని మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం సివిల్స్‌కు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఎంతో కొంత సాయం చేస్తే వారు లక్ష్యం సాధించేందుకు ఉపయోగపడుతుందని ఆలోచన చేసినట్లు చెప్పారు. సివిల్స్ సాధించేందుకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు అన్నివిధాలా సహకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. అభ్యర్థులకు మనోధైర్యం కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం వరుసగా రెండో సంవత్సరం ఈ కార్యక్రమం చేపట్టిందని తెలిపారు. మెయిన్స్‌కు ఎంపికైన 180



మందికి ఒక్కొక్కరికి లక్ష రూపాయల చొప్పున అందిస్తున్నామన్నారు. ఇంటర్వ్యూకు ఎంపికైన వారికి సైతం లక్ష ఆర్థిక సాయం, ఢిల్లీలో వసతులు కల్పిస్తామని భరోసా ఇచ్చారు. మొదటి సంవత్సరం 148 మందికి ఆర్థిక సహాయం అందించగా పది మంది సివిల్ సర్వీసెస్‌కు ఎంపికయ్యారని వివరించారు. రాజీవ్ సివిల్స్ అభయ హస్తం పథకం గొప్ప ఆశయంతో కొనసాగిస్తున్నామని.. ఈ పథకం సహాయంతో సివిల్స్‌లో విజయం సాధించి, పరిపాలన విభాగంలో అంకితభావంతో పనిచేయాలని కోరారు. ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మిట్టల్ మాట్లాడుతూ.. సివిల్స్‌కు ఎంపికైన తర్వాత కూడా ఉన్నత స్థాయికి చేరుకునేందుకు నిత్యం శ్రమించాలని పిలుపునిచ్చారు. సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ మాట్లాడుతూ.. పేద ఇంటి పిల్లలు కూడా సివిల్స్‌లో విజయం సాధించాలనే ఉద్దేశంతో సీఎం, డిప్యూటీ సీఎం మార్గనిర్దేశంలో ఈ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు.

## ఓఆర్ఆర్‌పై రోడ్డు ప్రమాదం.. ముగ్గురి మృతి

కీసర: మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా కీసర ఔటర్ రింగ్‌రోడ్డు(ఓఆర్ఆర్)పై ప్రమాదం చోటుచేసుకుంది. ఔటర్‌పై పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులను ఓ వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో ముగ్గురు కార్మికులు అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని కేసు నమోదు చేసుకున్నారు. మృతులు ఒడిశాకు చెందిన నారాయణ(28), చెక్‌మోహన్(24), జైరామ్(32)గా గుర్తించారు. గాజువాక నుంచి సెల్‌ఫోన్ టవర్ సామగ్రితో వాహనం షామీర్‌పేట్ వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. వాహనం డ్రైవర్ మద్యం మత్తులో ఉన్నట్లు గుర్తించిన పోలీసులు అతడిని



అదుపులోకి తీసుకున్నారు.

## దేశానికి సరిపడా ఆయిల్‌పామ్ పండించే శక్తి తెలంగాణ రైతులకు ఉంది: మంత్రి తుమ్మల

ఇంచర్ల: దేశానికి సరిపడా ఆయిల్‌పామ్ పండించే శక్తి తెలంగాణ రైతులకు ఉందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. అవకాశం కల్పిస్తే ఏదైనా సాధించే అన్నదాతలు ఇక్కడ ఉన్నారని చెప్పారు. మంత్రి సీతక్కతో కలిసి ములుగు జిల్లాలోని ఇంచర్లలో ఆయిల్‌పామ్ పరిశ్రమకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అందరూ ఆయిల్‌పామ్, ఇతర హార్టికల్చర్ పంటలు వేయాలని సూచించారు. భవిష్యత్తులో అన్ని జిల్లాల్లో ఆయిల్‌పామ్ వేసుకునే అవకాశం కల్పిస్తామన్నారు. ఈ నెలాఖరుకు గానీ, సెప్టెంబర్ నెల మొదటి వారంలో గానీ సిద్దిపేట జిల్లా నర్మెట్టలో ప్రభుత్వం తరపున పెద్ద ఫ్యాక్టరీని



సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. '' రాబోయే 4 సంవత్సరాల్లో అన్ని జిల్లాలకు ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీలు వస్తాయి. తద్వారా రైతులు ఇంకా 10 నుంచి 15 లక్షల ఎకరాలు పంట వేయాల్సిన అవసరం ఉంది. పంట మీ దగ్గరికే వచ్చి తీసుకెళ్తారు. వారం రోజుల్లో నగదు ఖాతాలో జమ అవుతుంది. ప్రభుత్వమే ధర ఫిక్స్ చేస్తుంది. ఈ పంటలో పురుగు మందులు వేయాల్సిన అవసరం లేదు. ఆయిల్‌పామ్‌లో లాభాలు సాధించే రైతులకు ప్రతిఒక్కరికీ కారు ఉంటుంది. వ్యవసాయం చేయడం వల్ల వచ్చే సంపాదన చూస్తే ఆనందం కలుగుతుంది. మరే ఇతర వాటిలో ఇది దక్కదు'' అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు.

## కొనసాగుతున్న దర్యాప్తు.. హెచ్‌సీఏ సెక్రటరీ దేవరాజ్‌ను విచారిస్తున్న సీఐడీ అధికారులు

హైదరాబాద్: హెచ్‌సీఏలో అవకతవకల కేసులో సీఐడీ దర్యాప్తు కొనసాగుతోంది. ఐదో రోజు కస్టడీలో హెచ్‌సీఏ సెక్రటరీ దేవరాజ్‌ను అధికారులు విచారిస్తున్నారు. బీసీసీఐ నుంచి వచ్చిన నిధుల గోల్‌మాల్‌పై ఆయన్ను ప్రశ్నిస్తున్నారు. ఉప్పల్ స్టేడియం వద్ద ఉన్న హెచ్‌సీఏ కార్యాలయానికి తీసుకెళ్లి విచారిస్తున్నారు. అవకతవకలకు సంబంధించి కీలక సమాచారాన్ని సేకరిస్తున్నారు. మరోవైపు ఆదివారం దేవరాజ్ ఇంట్లో సీఐడీ అధికారులు సోదాలు చేశారు.

## సీఎం రేవంత్‌రెడ్డితో మహేశ్‌కుమార్ గౌడ్ భేటీ.. కీలక అంశాలపై చర్చ

హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ భేటీ ముగిసింది. గంటన్నరకుపైగా సాగిన సమావేశంలో పలు కీలక అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంపై నేతలిద్దరూ మాట్లాడుకున్నారు. ఈ నెల 16లేదా 17 తేదీల్లో పీసీసీ, పీఏసీ భేటీ ఉండే అవకాశం ఉంది. ఈ సమావేశంలో మెజారిటీ నేతల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని నేతలు నిర్ణయించారు. ముఖ్యంగా 42శాతం బీసీ రిజర్వేషన్లు, స్థానిక సంస్థల ఎన్నికలపై ఆ సమావేశంలోనే నిర్ణయం తీసుకోనున్నారు. బోర్డు, కార్పొరేషన్ డైరెక్టర్ల పోస్టుల నియామకాలు త్వరగా చేపట్టాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. జూబ్లీహిల్స్





అసెంబ్లీ ఉపఎన్నికలో పార్టీ అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. జనహిత పాదయాత్రలో ప్రజా విజ్ఞప్తుల పరిష్కారాలపై నేతలు చర్చించినట్లు సమాచారం.

## ఈ వారంలో బ్యాంకులకు వరుస సెలవులు..




**న్యూఢిల్లీ:** ఈ వారంలో బ్యాంకులకు వరుస సెలవులు రానున్నాయి. ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా దేశ వ్యాప్తంగా అన్ని బ్యాంకులకు హాలిడే ఉండనుంది. ఇక తర్వాతి రోజు అంటే ఆగస్టు 16న కృష్ణ జన్మాష్టమి, ఆగస్టు 17 ఆదివారం కావడంతో బ్యాంకులకు సెలవులు ఉండనున్నాయి. వీటితోపాటు ఆగస్టు 13న మణిపూర్ రాష్ట్రం 'పాట్రియట్స్ డే'ని జరుపుకుంటుంది. అందువల్ల అక్కడ ఆరోజు బ్యాంకులు, ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు ఉండనుంది. ఇక ఈ ఏడాది ఆగస్టు నెలలో వరుస సెలవులు వచ్చాయి. ఆర్‌బీఐ విడుదల చేసిన సెలవుల జాబితా ప్రకారం.. ఈ నెలలో దాదాపు 15 రోజులు బ్యాంక్ హాలిడేస్ ఉన్నాయి. ఆగస్టు 3 ఆదివారం కావడంతో దేశంలోని అన్ని బ్యాంకులకు సెలవు ఉంటుంది. ఆగస్టు 8న సిక్కింలో తేందోంగ్‌లో రుమ్ ఫాట్ పండుగ సందర్భంగా బ్యాంకులకు సెలవు ఉంటుంది. ఆగస్టు 9న రక్షా బంధన్, రెండో శనివారం కావడంతో సెలవు. ఆగస్టు 10 ఆదివారం ఆగస్టు 13 పాట్రియట్స్ డే (ఇంఫాల్-మణిపూర్) ఆగస్టు 15 - స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా దేశ వ్యాప్తంగా బ్యాంకులకు సెలవు ఆగస్టు 16- కృష్ణ జన్మాష్టమి సందర్భంగా హాలిడే (అహ్మదాబాద్, ఐజ్వాల్, భోపాల్, చండీగఢ్, చెన్నై, డెహ్రాడూన్, గ్యాంగ్‌టక్, హైదరాబాద్, జైపూర్, జమ్ము, కాన్పూర్, లక్నో, పాట్నా, రాయ్‌పూర్, రాంచీ, షిల్లాంగ్, శ్రీనగర్, విజయవాడ) ఉంటుంది. ఆగస్టు 17 ఆదివారం, ఆగస్టు 19న మహారాజా బిర్ బిక్రమ్ కిషోర్ మనిక్య బహదూర్ జయంతి సందర్భంగా త్రిపురలో బ్యాంకులకు సెలవు. ఆగస్టు 23 నాలుగో శనివారం, ఆగస్టు 24 ఆదివారం, ఆగస్టు 25 అస్సాంలో శ్రీమంత శంకరదేవ తిరుభావ తిథి సందర్భంగా ఆ రాష్ట్రంలోని అన్ని బ్యాంకులకు హాలిడే, ఆగస్టు 27 గణేశ్ చతుర్థి సందర్భంగా సెలవు, ఆగస్టు 28 గణేష్ చతుర్థి రెండో రోజు, నూఆఖై పండుగ. ఈ పండుగను ఒడిశా, గోవాలో జరుపుకుంటారు. దీంతో అక్కడ 28వ తేదీన బ్యాంకులకు సెలవు ఉంటుంది.

## లాభాల్లోకి మార్కెట్లు..

### సెన్సెక్స్ 746 పాయింట్లు జంప్..!



**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం లాభాల్లో ముగిశాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల నేపథ్యంలో ఇటీవల మార్కెట్లు పతనమయ్యాయి. విదేశీ పెట్టుబడులతో మదుపరుల కాన్ఫిడెన్స్ పెరగడంతో మార్కెట్లు వారంలో తొలిరోజు లాభాల్లోకి దూసుకెళ్లాయి. ఉదయం మార్కెట్లు ఫ్లాట్‌గా మొదలైనా ఆ తర్వాత లాభాల్లో కొనసాగాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 79,885.36 పాయింట్ల వద్ద ఫ్లాట్‌గా మొదలైంది. ఇంట్రాడేలో 79,772.46 పాయింట్ల కనిష్టానికి చేరిన సెన్సెక్స్.. అత్యధికంగా 80,636.05 పాయింట్లకు చేరింది. చివరకు 746.29 పాయింట్ల లాభంతో 80,604.08 వద్ద స్థిరపడింది.

నిఫ్టీ 221.75 పాయింట్లు పెరిగి 24,585.05 వద్ద ముగిసింది. దాదాపు 2,136 షేర్లు లాభపడగా.. 1,867 షేర్లు నష్టపోయాయి. అదానీ ఎంటర్‌ప్రైజెస్, టాటా మోటార్స్, ఎటర్నల్, గ్రాసిమ్ ఇండస్ట్రీస్, అపోలో హాస్పిటల్స్, ట్రెంట్, ఎస్‌బీఐ, జియో ఫైనాన్షియల్, అల్ట్రాటెక్ సిమెంట్ లాభాల్లో కొనసాగగా.. హీరో మోటోకార్ప్, భారత్ ఎలక్ట్రానిక్స్, భారతి ఎయిర్‌టెల్ నష్టాల్లో ముగిశాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.8 శాతం, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.35 శాతం పెరిగాయి. కన్స్యూమర్ డ్యూరబుల్స్ మినహా, మిగతా అన్ని రంగాల సూచీలు ఫార్మా, మెటల్, ఆటో, ఆయిల్ అండ్ గ్యాస్, పీఎస్‌యూ బ్యాంక్, రియాల్టీ 0.5-2 శాతం పెరిగాయి.

## ఢిల్లీలో టెస్లా సెకెండ్ షోరూం ప్రారంభం




**న్యూఢిల్లీ:** ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన లగ్జరీ ఎలక్ట్రిక్ కార్ల తయారీ దిగ్గజం టెస్లా అధికారికంగా భారత విపణిలోకి అడుగుపెట్టిన విషయం తెలిసిందే. గత నెల 15న ఆర్థిక రాజధాని ముంబైలో తొలి షోరూంను ప్రారంభించింది. ఇప్పుడు రెండో షోరూంను కూడా తెరిచింది. దేశ రాజధాని ఢిల్లీలో తన సెకెండ్ షోరూంను సోమవారం అధికారికంగా ఓపెన్ చేసింది. ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి సమీపంలో గల ఏరోసిటీలో ఓపెన్ చేసింది.

ప్రస్తుతం ఎలక్ట్రిక్ కార్లలో అత్యధిక అమ్మకాలతో రికార్డు నెలకొల్పిన 'వై' మోడల్ కార్లను భారత వినియోగదారులకు అందుబాటులోకి తెచ్చింది టెస్లా. (రియర్-వీల్ డ్రైవ్), లాంగ్-రేంజ్ వేరియంట్ కార్లను అమ్మకానికి ఉంచింది. ఇక ధర విషయానికొస్తే రియర్-వీల్ డ్రైవ్ (ఆర్‌డబ్ల్యూడీ) వేరియంట్ ధర రూ. 59.89 లక్షలు, లాంగ్-రేంజ్ ఆర్‌డబ్ల్యూడీ వేరియంట్ ధరను రూ. 67.89 లక్షలుగా నిర్ణయించింది. వీటి 'ఆన్ రోడ్' ధరల్ని పరిశీలిస్తే వెర్షన్ ఆన్-రోడ్ ధర రూ. 61.07 లక్షలుకాగా, లాంగ్-రేంజ్ వెర్షన్ ఆన్-రోడ్ ధర రూ. 69.15 లక్షలుగా ఉంది. టెస్లా అధికారిక వెబ్‌సైట్ ప్రకారం, ఇందులో 18 శాతం జీఎస్టీతో సహా రూ. 50,000 అడ్మినిస్ట్రేషన్, సర్వీస్ ఫీజు కూడా ఉంటుంది.

ఈ వాహనాలు చైనాలోని టెస్లా షాంఘై గిగాఫ్యాక్టరీ నుంచి దిగుమతయ్యాయి. ఈ వై మోడల్ వేరియంట్ ధరలు అమెరికాలో 44,990 డాలర్లు (భారత కరెన్సీలో రూ.38.63 లక్షలు), చైనాలో 2,63,500 యువాన్ (రూ.31.57 లక్షలు), జర్మనీలో 45,970 యూరోలు (రూ.46.09 లక్షలు)గా ఉన్నాయి. వీటితో పోలిస్తే భారత్‌లోనే ఈ వై మోడల్ ధరలు అధికం కావడం గమనార్హం. దిగుమతి సుంకం, లాజిస్టిక్స్ ఖర్చులే ధర పెరుగుదలకు కారణంగా తెలుస్తోంది.




## మహిళల వన్డే ప్రపంచకప్

# ట్రోఫీ ఆవిష్కరణ

**న్యూఢిల్లీ:** మరో 50 రోజుల్లో భారత్ వేదికగా మహిళ వన్డే క్రికెట్ ప్రపంచకప్ టోర్నీ ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో సోమవారం ముంబైలో 'ఐసీసీ మహిళల క్రికెట్ ప్రపంచకప్-2025' ట్రోఫీని ఆవిష్కరించారు. భారత లెజెండ్ క్రికెటర్స్ యువరాజ్ సింగ్, మిథాలీ రాజ్‌తోపాటు ప్రస్తుత మహిళా క్రికెట్ స్టార్స్ హర్మన్ ప్రీత్ కౌర్, స్మృతి మందాన, జెమీమా రోడ్రిగ్స్, ఐసీసీ సీఈవో సంజోగ్ గుప్తా ఈ ట్రోఫీ ఆవిష్కరణలో పాల్గొన్నారు. ఐసీసీ ఛైర్మన్ జై షా ట్రోఫీ ఆవిష్కరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

'ఐసీసీ మహిళల క్రికెట్ ప్రపంచకప్-2025' ఇవాళ్టి నుంచి






సరిగ్గా 50 రోజుల్లో అంటే సెప్టెంబర్ 30న ప్రారంభం కానుంది. అయితే 2016 తర్వాత భారత్ మహిళల ఐసీసీ క్రికెట్ టోర్నీకి ఆతిథ్యం ఇవ్వడం ఇదే తొలిసారి. 2016లో భారత్‌లో మహిళల -20 క్రికెట్ ప్రపంచకప్ జరిగింది. అదేవిధంగా అంతకుముందు కూడా 1978, 1997, 2013లో భారత్ మహిళల క్రికెట్ ప్రపంచకప్‌కు ఆతిథ్యం ఇచ్చింది.

## జాతీయ క్రీడా పరిపాలన, యాంటీడోపింగ్ బిల్లులకు లోక్‌సభ ఆమోదం



**న్యూఢిల్లీ:** జాతీయ క్రీడా పరిపాలనా బిల్లు, జాతీయ యాంటీ-డోపింగ్ సవరణ బిల్లులకు సోమవారం లోక్‌సభ ఆమోదం తెలిపింది. ఆ బిల్లులను క్రీడాశాఖ మంత్రి మన్సూక్ మాండవీయ ఇవాళ సభలో ప్రవేశపెట్టారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత క్రీడల్లో జరిగిన అతిపెద్ద సంస్కరణజాతీయ క్రీడా పరిపాలన బిల్లు అని మంత్రి తెలిపారు. క్రీడాకారులు వైభవోపేతంగా వెలిగిపోవాలన్న ఉద్దేశంతో క్రీడా గవర్నెన్స్ బిల్లును తీసుకువచ్చినట్లు మంత్రి చెప్పారు. క్రీడా వ్యవహారాల్లో మహిళల ప్రాతినిధ్యాన్ని పెంచే ఉద్దేశం కూడా ఉన్నట్లు ఆయన చెప్పారు. యాంటీ డోపింగ్ బిల్లు కూడా కొత్త చట్టమే అని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న డోపింగ్ విధానాలను ఇది సమర్థిస్తుందన్నారు. పారదర్శకంగా డోపింగ్ చర్యలు చేపట్టే విధంగా చూడనున్నట్లు చెప్పారు. ఒకవైపు బిల్లుపై చర్చ జరుగుతుంటే.. విపక్ష సభ్యులు నినాదాలతో హోరెత్తించారు. బీహార్‌లో జరిగిన సిర్ ప్రక్రియపై చర్చ చేపట్టాలని విపక్షాలు డిమాండ్ చేశాయి. ఈ నేపథ్యంలోనే నేషనల్ స్పోర్ట్స్ గవర్నెన్స్ బిల్లు, నేషనల్ యాంటీ డోపింగ్ బిల్లును పాస్ చేశారు. రెండు క్రీడా బిల్లులు పాసైన తర్వాత తాత్కాలిక చైర్ సంధ్యా రే లోక్‌సభను సాయంత్రం 4 గంటల వరకు వాయిదా వేశారు.

## పెద్ద స్టార్ అవుతాడనుకున్నా..

### కానీ, చేజేతులా కెరీర్ నాశనం చేసుకుండు





**న్యూఢిల్లీ:** భారత క్రికెట్‌లోకి రాకెట్‌లా దూసుకొచ్చిన పృథ్వీ షా ఒకదశలో భావి సూపర్ స్టార్ అనిపించుకున్నాడు. స్కూల్ డేస్‌లోనే సచిన్ టెండూల్కర్ రికార్డు స్కోర్‌ను బ్రేక్ చేసిన అతడు టీమిండియాకు తరగని ఆస్తి అయ్యేలా కనిపించాడు. కానీ.. సీన్ రివర్సైంది. టీనేజ్ నుంచే ఎంతో స్టార్‌డమ్ సంపాదించుకున్న పృథ్వీ అంతేవేగంగా పాతాళానికి పడిపోయాడు. ఈ ముంబైకర్ కెరీర్ ప్రశ్నార్థకం కావడానికి తప్పుడు తోవ పట్టడమే కారణమని రోహిత్ శర్మ చిన్నప్పటి కోచ్ దినేశ్ లాడ్ అన్నాడు.

సచిన్ వారసుడు, మరో సెహ్వాగ్.. ఇలా క్రీడా దిగ్గజాల ప్రశంసలు అందుకున్న పృథ్వీ షా కెరీర్ చూస్తుండగానే తలకిందులైంది. ఎంతో ప్రతిభగల అతడు జట్టుకు దూరమవ్వడమే కాదు.. దేశవాళీలోనూ ఆడడంపై సందేహాలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో రోహిత్ చిన్నప్పటి కోచ్ దినేశ్ లాడ్ ఒక పాడ్‌కాస్ట్ షోలో షా వైఫల్యానికి కారణాలను విశ్లేషించాడు. 'నేను పృథ్వీ షాను చిన్నప్పటి నుంచి చూస్తున్నా. పదేళ్లకే అతడు ప్రతిభగల క్రికెటర్‌గా అవతరించాడు. కానీ, అనూహ్యంగా కెరీర్‌ను సందిగ్ధంలో పడేసుకున్నాడు. ఎవరి భవిష్యత్ అయినా వారి చేతుల్లోనే ఉంటుంది.

అయితే.. పృథ్వీ విషయంలో ఏం జరిగిందో నాకు తెలియదు. కానీ, అతడు ఇప్పటికీ ప్రతిభావంతుడే. దురదృష్టవశాత్తూ ఈ యంగ్‌స్టర్ చెడు మార్గాల్లో వెళ్లి.. చేజేతులా తన కెరీర్‌ను నాశనం చేసుకున్నాడు అని లాడ్ వెల్లడించాడు. చెడుతిరుగుళ్లు, క్రమశిక్షణరాహిత్యం, ఫిట్‌నెస్ లేమి వంటివి షా భవితవ్యాన్ని ప్రశ్నార్థకం చేశాయ'ని లాడ్ అభిప్రాయపడ్డాడు. కారణాలతో కెరీర్ నాశనం చేసుకున్నాడు.

### తొలి మ్యాచ్‌లోనే సెంచరీ

టీనేజ్ సంచలనంగా 2018లో టెస్టు అరంగేట్రం చేశాడు షా. వెస్టిండీస్‌పై రాజ్‌కోట్‌లో బరిలోకి దిగిన ఈ హిట్టర్ సెంచరీతో తన ఆగమనాన్ని ఘనంగా చాటాడు. అయితే.. ఆ తర్వాత అదే జోరు చూపలేక నాలుగేళ్లకే జట్టులో చోటు కోల్పోయాడు. అనంతరం ఐపీఎల్, దేశవాళీలో పరుగుల వరద పారించిన పృథ్వీ.. పునరాగమనం చేయలేకపోయాడు. అప్పటికే ఇషాన్ కిషన్, శుభ్‌మన్ గిల్, యశస్వీ జైస్వాల్ వంటి కుర్రాళ్లు జట్టులోకి రావడంతో షాకు దారులు మూసుకుపోయాయి. నిరుడు రంజీ ట్రోఫీలో బెంచ్‌కే పరిమితమైన పృథ్వీ.. ఈసారి దేశవాళీలో మహారాష్ట్ర తరఫున ఆడనున్న విషయం తెలిసిందే.

# ఫిట్‌నెస్‌పై పాండ్యా ఫోకస్..

### ఆసియా కప్ స్క్వాడ్‌లో ఉంటాడా..!

**న్యూఢిల్లీ:** టీ20 వరల్డ్ కప్ హీరో హార్దిక్ పాండ్యా పునరాగమనానికి సిద్ధమవుతున్నాడు. వచ్చే నెలలో ప్రారంభం కానున్న ఆసియా కప్ స్క్వాడ్‌లో చోటు దక్కించుకునేందుకు ఫిట్‌నెస్‌పై దృష్టి సారించాడు. యూఏఈ వేదికగా జరుగబోయే ఈ టోర్నీకి సమయం దగ్గరపడుతుండడంతో ఫిట్‌నెస్ టెస్టులో పాస్ అయ్యేందకు చెమటోడ్చుతున్నాడు పాండ్యా. బెంగళూరులోని నేషనల్ క్రికెట్ అకాడమీలో పాండ్యా తన ఫిట్‌నెస్‌కు మెరుగులు దిద్దుకోనున్నాడు. ఆగస్టు 11, ఆగస్టు 12.. రెండు రోజులు ఎన్‌సీఏలోని బృందం ఈ పేస్ ఆల్‌రౌండర్ పరీక్షలు నిర్వహించింది. అన్ని టెస్టుల్లోనూ సత్తా చాటితే ఆసియా కప్ ఎంపికకు పాండ్యా అందుబాటులో ఉండే అవకాశముంది.

టైమ్స్ ఆఫ్ ఇ ఇండియా కథనం ప్రకారం.. జూలై మధ్య నుంచే పాండ్యా ముంబైలో తన వర్కవుట్ రొటీన్‌ను షురూ చేశాడు. ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్ పోస్ట్ ద్వారా అభిమానులకు హింట్ ఇచ్చాడీ స్టార్ ప్లేయర్. ఎన్‌సీఏలో చిన్న ట్రిప్ ఉంది అని ఆదివారం ఒక క్యాప్షన్ పెట్టిన పాండ్యా..




తన పునరాగమనంపై అప్డేట్ ఇచ్చాడు. నిరుడు పొట్టి ప్రపంచ కప్, ఈ ఏడాది ఛాంపియన్స్ ట్రోఫీ విజయంలో పాండ్యా కీలక పాత్ర పోషించాడు.

టీ20 ఫార్మాట్‌లో జరుగబోయే ఆసియా కప్ సెప్టెంబర్ 9న ప్రారంభం కానుంది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ వేదికగా మొదలవ్వనున్న ఈ టోర్నీకి స్క్వాడ్ ఎంపిక భారత సెలెక్టర్లకు సవాల్‌గా మారింది. ఎందుకంటే.. జూన్‌లో స్పోర్ట్స్ హెర్నియా సర్జరీ చేయించుకున్న సూర్యయాదవ్ యాదవ్ కోలుకునే దశలో ఉన్నాడు. ఈ మిస్టర్ 360 సైతం ఫిట్‌నెస్ కోసం ఎన్‌సీఏలో చేరాడు. మ్యాచ్ విన్నర్ అయిన పాండ్యా సైతం ఫిట్‌నెస్ చాటుకోవాల్సి ఉంది. ఇద్దరూ కీలక ఆటగాళ్లు కావడంతో.. త్వరగా ఫిట్‌నెస్ నిరూపించుకోవాలని యావత్ క్రీడాలోకం కోరుకుంటోంది.




# సినీ ప్రేక్షకులకు ఇక పండగే

## సందడి చేయనున్న కూలీ, వార్-2



**టాకీస్:** సినీ ప్రేక్షకులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న సమయం రానే వచ్చింది. మరో మూడు రోజుల్లో రెండు పెద్ద సినిమాలు ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాయి. ఇందులో ఒకటి సూపర్ స్టార్ రజనీకాంత్ నటిస్తున్న కూలీ సినిమా కాగా.. మరోకటి హృతిక్ రోషన్, ఎన్టీఆర్ కలిసి నటిస్తున్న వార్ 2. ఈ రెండు సినిమాలు ఇండిపెండెన్స్ డే కానుకగా.. ఆగష్టు 14న ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాయి. విడుదలకు ఇంకా మూడు రోజులే ఉండడంతో భారీ ఎత్తున్న ప్రమోషన్స్ చేస్తున్నారు మేకర్స్. ఒకవైపు కూలీ సినిమాకు లోకేష్ కనగరాజ్ దర్శకత్వం వహించనుండటం.. నాగర్జున, ఆమీర్ ఖాన్, ఉపేంద్ర, వంటి అగ్ర తారలు నటిస్తుండటంతో మూవీపై భారీ అంచనాలు నెలకొన్నాయి. అలాగే వార్ 2 సినిమాకు అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహించటం.. ఎన్టీఆర్ కూడా ఈ ఫ్రాంచైజీలో భాగం కావడంతో అభిమానులు ఆతృతగా ఎదురుచూస్తున్నారు. అయితే ఈ వీకెండ్ ఈ రెండు చిత్రాలే కాకుండా ఓటీటీలో కూడా పలు సినిమాలు సందడి చేయబోతున్నాయి.

# వందకోట్ల క్లబ్‌లో చేరిన కింగ్‌డమ్

**టాకీస్:** కథానాయకుడు విజయ్ దేవరకొండ నటించిన కింగ్‌డమ్ చిత్రం తాజాగా రూ.100 కోట్ల క్లబ్‌లో చేరింది. ఈ విషయాన్ని చిత్రబృందం ప్రకటించింది. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో ఈ సినిమాకు నాగవంశీ నిర్మాతగ వ్యవహారించగా.. భాగ్యశ్రీ భోర్సే కథానాయికగా నటించింది. అయితే జూలై 31న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం మొదటిరోజు నుంచే బాక్సాఫీస్ వద్ద పరుగులు పెడుతుంది. తాజాగా ఈ చిత్రం రూ.100 కోట్ల క్లబ్‌లో చేరినట్లు- మేకర్స్ ప్రకటించారు. దీంతో గీతా గొవిందం(రూ.130 కోట్లు-) తర్వాత రెండోసారి రూ.100 కోట్ల క్లబ్‌లో చేరిన హీరోగా విజయ్ రికార్డును అందుకున్నాడు.






# సినిమా వేరు.. వ్యక్తిగత జీవితం వేరు: రష్మిక

టాకీస్: సామాజిక మాధ్యమాల్లో ఎన్ని విమర్శలు ఎదురైనప్పటికీ దృఢంగా ఉండి.. నా కెరీర్‌పైనే దృష్టి పెడుతున్నానని అందాల తార రష్మిక అంటోంది. 'పుష్ప 2', 'కుబేర' చిత్రాలతో వరుస విజయాలందుకొని జోరుమీదుందీ భామ. ప్రస్తుతం మహిళా ప్రాధాన్య కథలతో బిజీగా గడుపుతున్న ఆమె.. తన భావోద్వేగాలను ప్రజల ముందు ప్రదర్శించడానికి ఇష్టపడనని అంటోంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న రష్మిక మాట్లాడుతూ.. నేను ఒక నటిని. నా వ్యక్తిగత, వృత్తిపరమైన జీవితానికి చాలా వ్యత్యాసం ఉంటుంది. నేను ఇంట్లో ఎలా ఉంటానో చూస్తే మీరు ఆశ్చర్యపోతారు. చాలా ఎమోషనల్ పర్సన్‌ని నేను. కానీ నేను నా భావోద్వేగాలను బయటికి చూపించను. ఎందుకంటే అభిమానులు నా దయా గుణాన్ని నా బలహీనత అనుకుంటారు. లేకపోతే నేను కెమెరాల కోసమే ఇదంతా చేస్తున్నా అనుకుంటారు. మనం ఎంత నిజాయతీగా ఉంటే.. అంత వ్యతిరేకత మనపై వస్తుంది. దీంతో పాటు నా చుట్టూ ఉండే నెగిటివిటీతో ప్రభావితం కాకుండా ఉండటానికి కూడా చాలా కష్టపడుతున్నానని చెప్పుకొచ్చింది.

# మాస్ జాతర టీజర్ విడుదల

**టాకీస్:** కథానాయకుడు రవితేజ నుంచి రానున్న 75వ చిత్రం 'మాస్ జాతర'భాను భోగవరపు దర్శకుడిగా పరిచయమవుతున్న ఈ సినిమాలో శ్రీలీల కథానాయిక. ఆగస్టు 27న ఇది విడుదల కానుంది. ఈ నేపథ్యంలో




చిత్రబృందం తాజాగా టీజర్‌ను విడుదల చేశారు. ఇందులో రవితేజ పోలీస్ పాత్రలో 'నాకంటూ ఓ చరిత్ర ఉంది..' అంటూ మాస్ డైలాగులతో అలరిస్తూ కనిపించారు. ఈ మాస్ మహారాజ్ పంచ్‌లు వేస్తోన్న టీజర్‌ను చూసిన వారు బాగుందని అంటున్నారు.




# శివకార్తికేయన్ నయా అవతార్..

## మదరాసి మేకింగ్ వీడియో వైరల్

**టాకీస్:** కోలీవుడ్ స్టార్ యాక్టర్ శివకార్తికేయన్ నటిస్తోన్న చిత్రాల్లో ఒకటి ఎస్‌కే23. ఏఆర్ మురుగదాస్ డైరెక్షన్‌లో వస్తోన్న ఈ మూవీ మదరాసి టైటిల్‌తో తెరకెక్కుతోంది. ఇప్పటికే లాంచ్ చేసిన పోస్టర్‌తోపాటు టైటిల్ గ్లింప్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఈ మూవీ అప్‌డేట్ కోసం ఎదురుచూస్తున్న అభిమానులు, మూవీ లవర్స్ కోసం ఏఆర్ మురుగదాస్ టీం ఓ మేకింగ్ వీడియోను షేర్ చేసింది. శివకార్తికేయన్ ఈ సినిమాలో నయా అవతార్‌ను చూపించేందుకు ఎలా కష్టపడ్డాడో ఈ వీడియో హింట్ ఇచ్చేస్తోంది.

ఇక విద్యుత్ జమ్వాల్, మలయాళ నటుడు బిజూమీనన్‌తో వచ్చే సన్నివేశాలు సినిమాకు హైలెట్‌గా ఉండబోతున్నాయని మేకింగ్ విజువల్స్ చెప్పకనే చెబుతున్నాయి. మోస్ట్ పవర్ ఫుల్ ప్రాజెక్ట్ మదరాసి 25 రోజుల్లో మీ ముందుకు రాబోతుందంటూ ట్వీట్ చేశారు. ఈ వీడియో




నెట్టింట హల్ చల్ చేస్తోంది.

ఈ చిత్రంలో కన్నడ భామ రుక్మిణి వసంత ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా.. పాపులర్ మాలీవుడ్ యాక్టర్, అయ్యప్పనుమ్ కొషియుమ్ ఫేం బిజూమీనన్, బాలీవుడ్ స్టైలిష్ యాక్టర్ విద్యుత్ జమ్వాల్ కీలక పాత్రలో నటిస్తున్నారు. ఈ మూవీని తెలుగు, కన్నడ, తమిళం, మలయాళ భాషల్లో విడుదల కానున్నట్టు మేకర్స్ ఇప్పటికే తెలియజేశారు.

# సత్యదేవ్ కథానాకుడిగా ఆర్‌బీ వర్కింగ్ టైటిల్






**టాకీస్:** కేరాఫ్ కంచరపాలెం' ,'ఉమా మహేశ్వర ఉగ్ర రూపస్య' వంటి చిత్రాలతో దర్శకుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు వెంకటేశ్ మహా. విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో తీసిన ఈ చిత్రాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. అయితే ఈ సినిమాల అనంతరం వెంకటేశ్ చాలా రోజుల గ్యాప్ తర్వాత తన కొత్త సినిమాను ప్రకటించాడు. ఆర్‌బీ అనే వర్కింగ్ -టైటిల్‌తో రాబోతున్న ఈ సినిమాలో సత్యదేవ్ కథానాయకుడిగా నటించబోతుండగా.. జీఎంబీ, శ్రీచక్ర ఎంటర్‌టైనమెంట్స్ బ్యానర్‌లపై మహేశ్ బాబు, అనురాగ్ రెడ్డి నిర్మించబోతున్నట్లు- సమాచారం. ఈ సినిమా -టైటిల్‌తో పాటు- ఫస్ట్ లుక్‌ని మంగళవారం గంటలకు విడుదల చేయబోతున్నట్లు- చిత్రయూనిట్ సోషల్ మీడియా వేదికగా ప్రకటించింది.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.